
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 9 మే 2024



నేడు చంద్రబాబు విశాఖ రాక



విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో 10.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని 10.40 గంటలకు హెలికాప్టర్‌లో పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం వెళ్లి ఎన్నికల సభలో పాల్గొంటారు. ఆ తరువాత విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ఎన్నికల సభకు హాజరై సాయంత్రం 5.10 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం చేరుకుంటారు. సాయంత్రం 5.45 గంటలకు సీతంపేటలో నిర్వహించనున్న ఎన్నికల సభలో పాల్గొంటారు.

కొనసాగుతున్న పోస్టల్ ఓటింగ్

- నేడు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి తుది గడువు
- జిల్లాలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 14,162

అనకాపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో గత మూడు రోజులుగా ఉద్యోగులు పోటెత్తుతున్నారు. జిల్లాలో గతంలో ప్రకటించిన 16 వేలకు పైగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉండగా ఆరు ఫెసిలిటేషన్ సెంటర్లలో గత మూడు రోజుల్లో బుధవారం సాయంత్రానికి 14,162 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఫెసిలిటేషన్ సెంటర్ల వారీగా చోడవరం 2,493, మాడుగుల 2,205, అనకాపల్లి 2,926, ఎలమంచిలి 2,116, పాయకరావుపేట 1,876, నర్సీపట్నం 2,546 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు.

నేడు ఓటింగ్‌కు అవకాశం

జిల్లాలో ఎన్‌సీసీ, పోలీస్ శాఖల్లో మరో 2,140 మంది ఉద్యోగులకు 9వ తేదీ కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్‌సీసీ, పోలీసు శాఖలోని ఉద్యోగులు ఫారం-12 ఇచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

అనకాపల్లిలో మూడు బూత్‌లు ఏర్పాటు

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ గురువారం పోలీస్‌శాఖ, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు, మాజీ సైనిక ఉద్యోగులకు మాత్రమే కొనసాగుతుందని అనకాపల్లి ఆర్‌వో జాహ్నవి తెలిపారు. వీరి కోసం పోలింగ్ కేంద్రంలో మూడు బూత్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

రేపే అప్పన్న నిజరూప దర్శనం

- తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులకు దర్శనాలు

-6లో



దారితప్పిన పాలన

రోడ్లు వేయలేని నాయకులారా...మీకు ఓట్లు అడిగే అర్హత ఉందా?

గజానికొక గతుకు...అడుగుకో అతుకుతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని రహదారులు దారుణంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కొన్ని పల్లెలకు కనీసం 108 వాహనం కూడా చేరుకోలేని దుస్థితి నెలకొంది. కనీస మరమ్మతులకు నోచుకోని రోడ్లు చెరువులను తలపించేలా ఛిద్రమైనా రూపాయి కూడా విదల్చలేదు. నిత్యం సంక్షేమం అంటూ కబుర్లు చెప్పే వైసీపీ నాయకులకు..గుంతలు పడిన రహదారులు కనిపించడం లేదా?...అని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రహదారి పనులకు నిధులు ఇవ్వకుండా ఆపేశారు. పోనీ అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రారంభించిన రోడ్ల పనులైనా పూర్తి చేశారంటూ అదీ లేదు. కనీసం రోడ్లు వేయలేని నాయకులు మళ్లీ ఏ ముఖం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వీరా భవిష్యత్తుకు బాటలు వేసేది?...అంటూ ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని రహదారులపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్... 'జన కేతనం'లో

-7లో



రోడ్డే... డొంక కాదు !

ఈ చిత్రంలో కనిపిస్తున్నది డొంక రోడ్డు కాదు...ప్రధాన రహదారే. ఎలమంచిలి మండలం పులపర్తి నుంచి ఏటికొప్పాక గ్రామానికి వెళ్లే మార్గం. మండలంలో మేజర్ పంచాయతీ, హస్త కళారంగంలో జాతీయ ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాకకు వెళ్లే రహదారి గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి నిర్వహణ పనులకు నోచుకోకపోవడంతో గోతులమయమై పోయింది. కొద్దిదూరం అయితే రోడ్డు ఇరుపక్కలా ఆనవాళ్లు కోల్పోయింది. మధ్యలో మనిషి నడిచేందుకు మాత్రమే తారు మిగిలి ఉంది.

- ఎలమంచిలి

వైసీపీ స్వార్థానికి బార్క్ నిర్వాసితులు బలి

- తంతడి పంచాయతీలోని రెండు కొండలు కూడా కావాలని కోరిన యాజమాన్యం
- అక్కడి రైతులు వ్యతిరేకించి తీవ్ర ఆందోళనలు
- బాధితులకు పరిహారం ఇవ్వడానికి ముందుకు వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం
- అర్హులతో జాబితా తయారీ
- ఇంతలో ఎన్నికలు జరిగి అధికారంలోకి వచ్చిన వైసీపీ
- జాబితా తారుమారు.. అనర్హులకు అందులో చోటు
- అసలైన లబ్ధిదారుల పేర్లు తొలగింపు
- కోర్టును ఆశ్రయించిన బాధితులు
- స్టే విధించడంతో పరిహారం నిలుపుదల
- భూమి లేక, పరిహారం రాక నిర్వాసితుల ఇబ్బందులు

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో రెండు వేల ఎకరాలు బార్క్‌కు కేటాయింపు



కొండ చుట్టూ బార్క్ యాజమాన్యం ప్రహరీ నిర్మించిన దృశ్యం

అచ్యుతాపురం, మే 8:

వైసీపీ నాయకుల స్వార్థానికి మండలంలో బాబా ఆటమిక్ రీసెర్క్ సెంటర్ (బార్క్) నిర్వాసితులు నష్టపోయారు. టీడీపీ హయాంలో తయారు చేసిన జాబితాలను వైసీపీ నాయకులు తారుమారు చేయడంతో పాటు స్థానికేతరులను, వైసీపీ సానుభూతిపరులను చేర్చారు. అంతేకాకుండా అసలైన లబ్ధిదారుల్లో చాలా మంది పేర్లు తొలగించారు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. దీని వల్ల ఇప్పటి వరకు నిర్వాసితులకు పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నారు.

అచ్యుతాపురం మండలం ఉమ్మడి తంతడి పంచాయతీ పరిధిలో రాజానపాలెం, వాడపాలెం, తంతడి, యాతపాలెం, అంగవానిపాలెం గ్రామాలున్నాయి. తంతడి పంచాయతీ పరిధిలో గల సర్వే నంబర్ 141లో 118.67 ఎకరాలు, సర్వే నంబరు 238లో 318.29 ఎకరాల పరిధిలో రెండు కొండలున్నాయి. సుమారు 45 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి కొండ సాగు చేసుకోవడానికి డీ పట్టాలిచ్చింది. దీంతో కొన్ని కుటుంబాలు అక్కడ జీడిమామిడి సాగు చేసుకుంటున్నారు. కాగా 2005లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) కోసం ఏపీఐఐసీ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సుమారు పదివేల ఎకరాలు భూసేకరణ చేసింది. ఇందులో సుమారు రెండు వేల ఎకరాలు బాబా అటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)కి కేటాయించింది. బార్క్‌కి కేటాయించిన భూమిలో తంతడి పంచాయతీలో గల గ్రామాలకు చెందిన 398 ఎకరాల భూమి పోయింది. అప్పట్లో ఎకరాకు కేవలం రూ.2.95 లక్షలు మాత్రమే పరిహారం ఇచ్చారు. అప్పట్లోనే చాలా మంది రైతులు తమ భూములు పూర్తిగా కోల్పోయారు. అప్పటికి కొండపై జీడిమామిడి తోటలు సాగుచేసుకుంటున్న రైతులు మాత్రమే మిగిలారు. అయితే ఈ కొండ ప్రాంతం తమ గ్రీనరీకి కావాలని బార్క్ కోరడంతో ఏపీఐఐసీ కొండ ప్రాంతంలో సాగుచేసుకుంటున్న రైతులకు ఫోర్‌వన్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వానికి చెందిన భూములు కాబట్టి రెండు కొండ ప్రాంతాలు తమకు అప్పగించాలని రైతులను అధికారులు ఆదేశించారు. దీంతో రైతులు తాము ఏళ్ల తరబడి సాగుచేసుకుని జీవిస్తున్నామని, తమకు కూడా పరిహారం ఇవ్వాలని భారీస్థాయిలో ఆందోళనలు చేశారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ వీరికి కూడా పరిహారం ఇవ్వడానికి అంగీకరించి సర్వే

... మిగతా 8వ పేజీలో

అనుకున్నదొక్కటి..!

ప్రభుత్వంలో విలీనంపై ఆర్టీసీ ఉద్యోగుల నిట్టూర్పు

- లాభం కంటే నష్టమే ఎక్కువ
- సంజీవిని లాంటి మెడిక్లెయిమ్ రద్దు
- వైసీపీ హయాంలో కొత్తబస్సుల కొనుగోలుకీ బడ్జెట్ నిల్
- ఖాళీల భర్తీకీ లభించని గ్రీన్‌సిగ్నల్
- 3,600 డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రతిపాదన బుట్టదాఖలు
- మెడికల్ అన్‌ఫిట్ అయితే ప్రత్యామ్నాయం కరవు
- సర్కారు తీరుపై ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల్లో అసంతృప్తి



(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

కార్పొరేషన్‌గా ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రయోజనాలు దక్కుతాయని సంబరపడిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు నిరాశే ఎదురైంది. కొత్తగా ఒకటి, రెండు ప్రయోజనాలు మినహా ఉన్న వాటిలో పీకేసినవే ఎక్కువ కావడంతో ఎటూ పాలుపోని స్థితిలో దిక్కులు చూడాల్సిన పరిస్థితిలో ఆర్టీసీ ఉద్యోగుల ఉన్నారు.

ఆవిర్భావం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్పొరేషన్‌గా ఆర్టీసీ కార్యకలాపాలు సాగిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత 62 వేల మంది ఉద్యోగులతో ఉన్న ఆర్టీసీని అధికారంలోకి వస్తే ప్రభుత్వంలో విలీనం చేస్తామని పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో తమ తలరాతలు మారిపోతాయని భావించిన ఆర్టీసీ కార్మికులు గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతు తెలిపారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ ఒత్తిడి చేశారు. ఈ మేరకు 2022లో ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైంది. వెంటనే ప్రభుత్వ ఉద్యోగులతో పాటే పీఆర్సీని వర్తింపజేయడంతో ఉద్యోగులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ప్రతి ఆరేళ్లకు ఒకసారి పదోన్నతి లభించకపోతే ఏఏఎస్ఎల్ కింద ఒక ఇంక్రిమెంట్ పొందే అవకాశం అందుబాటులోకి వచ్చిందని సంబరపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలుచేస్తామని వైసీపీ హామీ ఇచ్చినందున ఆ సదుపాయం తమకు కూడా దక్కుతుందనుకున్నారు. తీరా ప్రభుత్వం చేతులెత్తేయడంతో నీరుగారిపోయారు.

కోల్పోయినవే ఎక్కువ...

ఇదిలావుంటే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంలో అప్పటివరకూ పొందిన ప్రయోజనాల్లో చాలావాటిని కోల్పోయామని ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు. కార్పొరేషన్‌గా ఉండగా ఉద్యోగి/కార్మికుడు అనారోగ్యానికి గురైనా, వారి కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందినా, శస్త్రచికిత్స అవసరమైనా సంస్థ రూ.కోటి వరకూ భరించేది. అయితే ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఆ సదుపాయాన్ని కోల్పోయామంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) అమలవుతోంది. ఉద్యోగులు ప్రతినెలా రూ.250 చొప్పున చెల్లిస్తే ప్రభుత్వమే వైద్య ఖర్చులను భరిస్తుంది. అయితే ప్రస్తుతం ఈహెచ్‌ఎస్ కింద కేవలం దంతాలు, కంటిచూపునకు సంబంధించిన వైద్యం మాత్రమే అందుతోందంటున్నారు. అది కూడా కొన్ని ఆస్పత్రులకే పరిమితం చేయడంతో సరైన వైద్యం అందడం లేదని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు.

కొత్తబస్సుల్లేవు...

గతంలో కొత్త బస్సులు కొనుగోలుకు ప్రభుత్వాలు ఏటా రూ.200 కోట్లు వరకూ కేటాయించేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధుల మంజూరు నిలిచిపోయింది. దీంతో కొత్త బస్సులు కొనుగోలుకు అవకాశం లేక ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు గగ్గోలు పెడుతున్నారు.

ఖాళీల భర్తీపై నిర్లక్ష్యం

రాష్ట్ర విభజన నాటికి ఆర్టీసీలో 62 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, సంస్థ ప్రభుత్వంలో విలీనం అయ్యే

... మిగతా 8వ పేజీలో

హామీలే తప్ప అమలు ఏది?

రహదారి సౌకర్యం, తాగునీరు, బడి ఏర్పాటు చేస్తానని గత ఎన్నికల సమయంలో ధర్మశ్రీ హామీ

- మళ్లీ రెండేళ్ల క్రితం పాత పాట
- ఐదేళ్లుగా ఒక్క హామీ నెరవేర్చని వైనం
- రహదారి లేక తప్పని డోలీ మోతలు
- బడి లేక చదువుకు దూరమవుతున్న బాలలు
- ఓట్లు వేసి మోసపోయామని లోసింగి, పెదగరువు, పిత్రిగెడ్డ, కొత్తలోసింగి గ్రామాల గిరిజనుల ఆవేదన



రహదారి సౌకర్యం లేక డోలీమోతపై రోగిని తీసుకువెళుతున్న దృశ్యం (ఫైల్)

రోలుగుంట, మే 8:

'నన్ను గెలిపిస్తే ఆరు నెలల్లో మీ గ్రామాలకు రహదారి సౌకర్యం, తాగునీరు, బడి ఏర్పాటు చేస్తా. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా'.. ఇవీ 2019 మార్చి నెలలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రోలుగుంట మండలం లోసింగి, పెదగరువు, పిత్రిగెడ్డ, కొత్తలోసింగి గ్రామాల ప్రజలకు కరణం ధర్మశ్రీ ఇచ్చిన హామీలు. ఆయన ఎమ్మెల్యేగా గెలవడం, వైసీపీ అధికారంలోకి రావడం, ప్రభుత్వ విప్‌గా కూడా పదవి చేపట్టడం కూడా జరిగిపోయాయి. అయితే ఐదేళ్లు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేరలేదని, ఆయనను నమ్మి ఓట్లు వేసి మోసపోయామని ఆయా గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని అర్ల పంచాయతీ శివారు కొండ శిఖర గ్రామాలైన లోసింగి, కొత్తలోసింగి, పెదగరువు, పిత్రిగెడ్డ గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 300కు పైగా జనాభా కలిగిన ఆదివాసీ కొందు గిరిజనులు ఉన్నారు. వీరంతా నాలుగు దశాబ్దాల క్రితమే అవాసాలు ఏర్పాటు చేసుకుని పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన పథకాలు వీరికి సక్రమంగా అందడం లేదు. ఈ గ్రామాల్లో తాగునీరు, వైద్యం, రోడ్డు, విద్యుత్, విద్య తదితర సౌకర్యాలు లేవు.



రెండేళ్ల క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గుర్రంపై వెళుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ(ఫైల్)

రహదారి లేక తప్పని డోలీ మోతలు

దశాబ్దాలుగా ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. గతంలో వీరే సొంతంగా శ్రమదానం చేసి కొండలను తవ్వి పిత్రిగెడ్డ నుంచి అర్ల వరకు మార్గం ఏర్పాటు చేసుకున్నారు. గర్భిణులను, అలాగే ఎవరైనా అనారోగ్యానికి గురైనా ఆస్పత్రికి తీసుకువెళ్లాలంటే ఐదు కిలో మీటర్లు డోలీ మోత తప్పదు. పలుమార్లు వైద్యం అందక గర్భిణులు, బాలింతలు చనిపోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఇక్కడ కనీసం ఆశా కార్యకర్త కూడా లేరు. ఈ నాలుగు గ్రామాలకు చెందిన 50 మంది గిరిజనులకు లోసింగిలో సర్వే నంబరు 18, 19లలో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఆయా గ్రామాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇంటి నిర్మాణ సామగ్రిని తీసుకువెళ్లడానికి వీలులేక ఇప్పటికీ వీరు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. అలాగే మంచినీటి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాజులబంధ, పిత్రిగెడ్డ గ్రామాల్లో కొండల్లో నుంచి వచ్చే ఊట నీరునే తాగుతూ


... మిగతా 8వ పేజీలో

బూడికి మరో షాక్

- వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎర్రా అప్పారావు టీడీపీలో చేరిక

చీడికాడ, మే 8:

చీడికాడలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకి మరో షాక్ తగిలింది. మండలంలోని ఎల్ఎన్‌పురంలో బుధవారం జరిగిన యాదవ సంక్షేమ సంఘం సమావేశంలో వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎర్రా అప్పారావు టీడీపీలో చేరారు. ఈ మేరకు టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా దేవరాపల్లి, కె కోటపాడు మండలాల్లో వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీ కండువాలు వేసుకొని మూడు రోజులు గడవక ముందే చీడికాడ గ్రామానికి చెందిన అప్పారావు టీడీపీలో చేరడం చర్చనీయాంశమైంది. టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు, మాజీ జెడ్పీటీసీ పోతల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా అప్పారావు 2014 నుంచి 2021 వరకు వైసీపీ మండలాధ్యక్షుడిగా పనిచేశారు. ఏడాది కిందట వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైనప్పటికీ తగిన గుర్తింపు లేనందున వైసీపీని వీడి టీడీపీలో చేరినట్టు ఆయన తెలిపారు.



టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా టీడీపీ కండువా వేసుకున్న ఎర్రా అప్పారావు

జిల్లాలో ఇద్దరికి పాలీసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్

- చీడికాడ మండలం తురువోలు విద్యార్థిని జ్ఞాన హర్షిత, పాయకరావుపేట విద్యార్థి శ్రీరామ్ భవదీప్‌కు 120కి 120 మార్కులు



జ్ఞాన హర్షిత



శీలం శ్రీరామ్ భవదీప్

చీడికాడ, మే 8: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష (పాలీసెట్)లో అనకాపల్లి జిల్లాలో ఇద్దరు విద్యార్థులు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. గత నెలలో ఈ పరీక్ష నిర్వహించగా, ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన పోతల జ్ఞాన హర్షిత, పాయకరావుపేటకు చెందిన శీలం శ్రీరామ్ భవదీప్ 120 మార్కులకుగాను 120 మార్కులు సాధించారు. జ్ఞాన హర్షిత ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చోడవరం పాఠశాలలో, ఆరు నుంచి పదో తరగతి వరకూ విశాఖలోని నారాయణ స్కూల్‌లో చదువుకుంది. ఈమె తల్లిదండ్రులు పోతల అప్పలనాయుడు, ప్రగతి ఇద్దరూ

... మిగతా 8వ పేజీలో

సబ్బవరంలో మహిళా ఓటర్లదే హవా

- మొత్తం ఓటర్లు 59,542
- పురుషులు 29,143, మహిళలు 30,398
- మహిళా ఓటర్లు 1,255 మంది అధికం



సబ్బవరం, మే 8: మండలంలోని 24 పంచాయతీల్లో 59,542 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 29,143, మహిళలు 30,398 మంది, ట్రాన్స్ జెండర్ 1 ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 1,255 మంది అధికంగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో మండల ఓటర్లు 56,178 మంది ఉండగా 47,030 మంది(83.73 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో పురుషులు 27,716 మంది ఉండగా.. 23,047 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 4,669 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. మహిళా ఓటర్లు 28,462 మంది ఉండగా 23,991 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 4,471 మంది మహిళలు ఓటుకు దూరంగా ఉన్నారు. పైడివాడఅగ్రహారంలో అత్యధికంగా 94.59 శాతం నమోదయ్యింది. అత్యల్పంగా సబ్బవరం కేంద్రంలో 62.74 శాతం నమోదైంది.

మహిళలకు ఒక్క 'సారీ' దక్కని ఎలమంచిలి ఎమ్మెల్యే పీఠం

- మహిళా ఓటర్లే అధికం.. అయినా ప్రధాన పార్టీలు టికెట్లు ఇవ్వలేదు..
- స్వతంత్రులుగా పోటీ చేసినా గెలవలేదు..

ఎలమంచిలి, మే 8: ఉమ్మడి విశాఖ జిల్లాలోనే రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్న ఎలమంచిలి అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క 'సారీ' మహిళలకు అసెంబ్లీ పీఠం దక్కలేదు. నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 1952 నుంచి జరిగిన ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ మహిళలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నా ఎమ్మెల్యేగా గెలవలేకపోయారు. ఎలమంచిలి నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకూ 15 సార్లు ఎన్నికలు జరిగినా ప్రధాన రాజకీయ పార్టీలు మాత్రం ఒక్కసారి కూడా మహిళలను అభ్యర్థులుగా నిలబెట్టలేదు. ఎలమంచిలి నియోజకవర్గంలో 2,063,94 మంది ఓటర్లకు గాను పురుషులు 1,00,407, మహిళా ఓటర్లు 1,05,978 మంది ఉన్నారు. పురుషులు కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణించాలని చెబుతున్నా ఏ పార్టీ తమకు పోటీ చేసే అవకాశం ఇవ్వడం లేదని మహిళామణులు వాపోతున్నారు.

కొండకర్ల ఆవను అభివృద్ధి చేస్తాం

- కూటమి నేతలు సీఎం రమేశ్, సుందరపు, ప్రగడ



కొండకర్ల ఆవలో పర్యటిస్తున్న సీఎం రమేష్, సుందరపు, ప్రగడ తదితరులు

అచ్యుతాపురం, మే 8: కొండకర్ల ఆవను పర్యాటకం, వ్యవసాయం రంగానికి అనుబంధంగా అభివృద్ధి చేస్తామని అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్, టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం వారు కొండకర్ల ఆవను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ గల మత్స్యకారులు, రైతులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అతిపెద్ద మంచినీటి సరస్సు అయిన కొండకర్ల ఆవను గాలికి వదిలేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఆవను అభివృద్ధి చేస్తామన్నారు. ఆక్రమణలను తొలగించి ఆవలో పూడిక తీస్తే మరింత ఎక్కువ నీటిని నిల్వచేయవచ్చని, తద్వారా వ్యవసాయం రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసోం ఎంపీ ఖలీతా, బైలపూడి శ్రీరామదాసు, అగ్గాల హనుమంతరావు, డీఎస్ఎన్ రాజు, సీలా సందీప్, గొంతిన భక్త సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు

అంభేరుపురంలో వృద్ధురాలి మృతి

- పింఛన్ మొత్తం కోసం వారం రోజులుగా బ్యాంకు, సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు

చోడవరం, మే 8: పింఛన్ కోసం గత వారం రోజులుగా బ్యాంకు, సచివాలయం చుట్టూ తిరుగుతున్న అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అంభేరుపురం గ్రామానికి చెందిన తోలేటి పద్మావతి (64) బుధవారం కన్నుమూశారు. వివరాలిలా ఉన్నాయి. తోలేటి పద్మావతి, ఆమె భర్త ఆచారి అంభేరుపురం సమీపంలో నివాసం ఉండేవారు. కొంతకాలం క్రితం ఆచారి మృతిచెందారు. ఇదిలావుండగా పద్మావతికి వృద్ధాప్య పెన్షన్ వస్తోంది. ఎన్నికలను సాకుగా చూపి ప్రభుత్వం ఈ నెల పింఛన్‌ను బ్యాంకుల్లో జమ చేసిన విషయం తెలిసిందే. పద్మావతికి రావలసిన పింఛన్ మొత్తం జాయింట్ అకౌంట్ (ఆమెకు, ఆమె భర్తకు)లో జమ అయినట్టు తెలిసింది. దీంతో పింఛను కోసం బ్యాంకుకు వెళ్లగా భర్త చనిపోయినట్టు సర్టిఫికెట్, ఇతర వివరాలు సమర్పించాలని సిబ్బంది చెప్పారు. అందుకు సంబంధించిన పత్రాల కోసం పద్మావతి కొద్ది రోజులుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. బుధవారం మరోమారు బ్యాంకుకు వెళ్లి వచ్చారు. ఆ తరువాత కొద్దిసేపటికి పద్మావతి ఇంటి వద్ద మృతిచెంది ఉండడం చుట్టుపక్కలవారు గమనించారు. పింఛన్ మొత్తం కోసం ఇటు బ్యాంకుకు, అటు సచివాలయానికి తిరగాల్సి రావడం, తనకు ఇక పింఛను రాదేమోనన్న దిగులుతోనే ఆమె మృతి చెందిందని స్థానికులు అంటున్నారు.

పత్రికా ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12, 13 తేదీల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు పత్రికలలో ప్రకటనలు వేసే అభ్యర్థులు రెండు రోజులు ముందుగా ఎంసీఎంసీ ధ్రువీకరణ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. పత్రికల యాజమాన్యాలు సదరు ఎంసీఎంసీ ధ్రువీకరణ ముందస్తు అనుమతి లేకుండా పత్రికలలో రాజకీయ పార్టీల, అభ్యర్థుల ప్రకటనలు ప్రచురించరాదని కోరారు. పోటీచేసే అభ్యర్థి, పార్టీ తరుపున వేరొక సంస్థ లేదా వేరే వ్యక్తి ఇచ్చే వాటికి కూడా ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపారు.

హార్బర్ కోసం మత్స్యకారులతో ఆటలు

- లారీలను అడ్డుకున్న మత్స్యకార మహిళలు
- ఆందోళనకు దిగిన మత్స్యకారులు
- గతంలో ఆందోళన చేసినప్పుడు న్యాయం చేస్తానని సీఐ భరోసా
- ఇప్పుడు ఎన్నికలు చూద్దామంటున్న సీఐ

వారి భూముల్లో రాత్రి వేళల్లో గ్రావెల్ తవ్వకాలు, తరలింపు



పూడిమడక తీరంలో గ్రావెల్ కోసం తవ్విన గోతులు



గ్రావెల్ తరలిస్తున్న లారీలను అడ్డుకుంటున్న మత్స్యకార మహిళలు

అచ్యుతాపురం, మే 8: *పూడిమకలో హార్బర్ నిర్మాణానికి గ్రావెల్ రవాణా చేస్తున్న లారీలను మత్స్యకార మహిళలు బుధవారం అడ్డుకున్నారు. తాము 40 ఏళ్లుగా పెంచుకున్న జీడి, సరుగుడు తోటలకు పరిహారం ఇవ్వాలని వీరు కోరారు. తమకు పరిహారం ఇచ్చే వరకు వాహనాలను ఆపేస్తామని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే..*

మండలంలోని పూడిమడకలో హార్బర్ నిర్మాణానికి రోడ్డు పనులు జరుగుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే హార్బర్ కోసం సర్వే చేసింది. ఇందుకోసం సర్వే నంబరు 139లో 37 ఎకరాలు కేటాయించింది. అయితే వైసీపీ నాలుగున్నరేళ్లలో హార్బర్ ఊసెత్తలేదు. సరిగ్గా ఎన్నికలకు మూడు నెలల ముందు పూడిమడక నుంచి హార్బర్ నిర్మించే ప్రాంతానికి రోడ్డు పనులు ప్రారంభించింది. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న స్థలం అలైన్‌మెంట్‌ను వైసీపీ ప్రభుత్వం మార్చేసింది. దీంతో పూడిమడక మత్స్యకారులు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల గుండా రోడ్డు వేస్తున్నారు. సర్వే నంబరు 134/2, 135లలో పేర్ల మంగ, ఆంగా కామేశ్వరి, పేర్ల బాపనమ్మ, చేపల లక్ష్మి ఎనిమిదెకరాల్లో జీడి మామిడి, సరుగుడు తోటలు పెంచుకుంటూ వచ్చిన ఆదాయాన్ని కుటుంబ పోషణకు వినియోగించేవారు. అయితే హార్బర్ రోడ్డుకని చెట్లు తొలగించేశారు. దీంతో ఈ నాలుగు కుటుంబాల వారు తమకు పరిహారం చెల్లించాలంటూ తోటల వద్ద టెంట్ వేసి ఆందోళన ప్రారంభించారు. అయితే తగిన న్యాయం చేస్తామని, పనులకు అడ్డగించవద్దని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు బలవంతంగా ఆందోళన చేస్తున్న టెంట్‌ని తొలగించేశారని బాధితులు తెలిపారు. ఇదిలా ఉండగా నాలుగు రోజుల నుంచి ఆ భూముల్లో భారీ స్థాయిలో గ్రావెల్ తవ్వి రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ విషయం మంగళవారం వరకు తెలుసుకోలేకపోయామని బాధితులు తెలిపారు. రాత్రి పూట గుట్టు చప్పుడు కాకుండా పదుల సంఖ్యలో యంత్రాలు, వాహనాలు పెట్టి గ్రావెల్ తవ్వకాలు జరిపారు. తమ భూమిలో పెద్దపెద్ద గోతులు తవ్వి ఉన్నాయని, తీరం వరకు తవ్వేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుదవారం వీరు గ్రావెల్ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. రాత్రి కూడా తాము ఇక్కడే టెంట్ వేసి కాపలా ఉంటామని వారు తెలిపారు. తీరంలో ట్రాక్టర్ ఇసుక తీస్తేనే కేసులు నమోదు చేసే రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నామన్న సాకుతో చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ఆందోళన చేస్తున్న తాము అచ్యుతాపురం సీఐ ఇచ్చిన భరోసాతో విరమించుకున్నామని, ఇప్పుడు ఎన్నికల్లో బిజీగా ఉన్నామని, తర్వాత చూద్దామని సీఐ బుచ్చిరాజు తప్పుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ అన్ని వ్యవస్థల్ని మేనేజ్ చేసి తీరంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నా రెవెన్యూ, పోలీసులు పట్టించుకోవడం లేదు. అంతేకాక అడ్డు పడితే తీవ్ర పరిణామాలుంటాయని తమనే హెచ్చరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్యం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



వడ్డాదిలో ప్రచారం నిర్వహిస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, మే 8 : ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. మండలంలోని వడ్డాదిలో బుధవారం ఆయన కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. సీఎంజగన్ బారినుంచి రాష్ట్రాన్ని కేవలం చంద్రబాబునాయుడు మాత్రమే కాపాడ గలరన్నారు. నిత్యావసర ధరల పెంపు, విద్యుత్, ఆర్టీసీ బస్సు, రిజిస్ట్రేషన్ చార్జీల పెంచి జగన్‌రెడ్డి ప్రజల నడ్డివిరిచారని దుయ్యబట్టారు. జగన్ సర్కార్ కొత్తగా తెచ్చిన ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై ప్రజల్లో భయాందోళన నెలకొందన్నారు. ప్రజల ఆస్తులు కాజేసేందుకే ఈ యాక్టును తెచ్చారని ఆరోపించారు. కూటమి అధికారంలోకి రాగానే ఈ యాక్టును రద్దు చేస్తామన్నారు. ప్రజలంతా అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, దొండా నరేష్, రమేష్, దాడి సూర్యనాగేశ్వరరావు, రామ్మూర్తి, దొండా సాయి, సింగంపల్లి రమేష్, దొండా గిరిబాబు, తలారీ శంకరరావు, బొబ్బాది రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ వీరాభిమాని

- నాడు జగన్ కోసం కాలినడకన తిరుమలకు...
- వైసీపీ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరగలేదు..
- అందుకే తెలుగుదేశం పార్టీలో చేరినట్టు వెల్లడి

ఎస్.రాయవరం, మే 8: గత (2019) ఎన్నికల్లో జగన్ ముఖ్యమంత్రి అయితే తిరుపతికి పాదయాత్రగా వస్తానని మొక్కుకొన్న వీరాభిమాని ప్రస్తుతం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం గ్రామానికి చెందిన సాగి పాండురంగవర్మ వార్డు సభ్యుడు. వైసీపీ అంటే అభిమానం ఉన్న పాండురంగవర్మ గత ఎన్నికలప్పుడు జగన్ ప్రభుత్వం వస్తే తిరుమల కాలినడకన వస్తానని వెంకటేశ్వస్వామిని మొక్కుకున్నారు. జగన్ గెలిచి ముఖ్యమంత్రి కావడంతో 2019 జులై 9న ఇక్కడ నుంచి బయలుదేరి 22 రోజులపాటు నడిచి వెళ్లి స్వామివారికి మొక్కు చెల్లించుకున్నారు. అయితే అదే పాండురంగవర్మ బుధవారం పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పాండురంగవర్మ మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయితే తమ గ్రామంలో పేదలకు న్యాయం జరుగుతుందనుకున్నానని, కానీ వైసీపీ ప్రభుత్వంలో చేసింది ఏమీ లేదన్నారు.

జగన్ ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం జరగదనే తెలుగుదేశం పార్టీలో చేరినట్టు ఆయన చెప్పారు.



2019 జూలైలో కాలినడకన తిరుమల వెళుతున్న పాండురంగ వర్మ (ఫైల్)



రామయ్యపట్నంలో టీడీపీలో చేరిన తరువాత మాట్లాడుతున్న సాగి పాండురంగవర్మ

ఎన్డీఏ కూటమికి కాపులు మద్దతు



మాట్లాడుతున్న కాపు జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు

పాయకరావుపేట, మే 8 : రాష్ట్రంలో కాపులంతా ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతు పలకాలని ఏపీ కాపు జేఏసీ కన్వీనర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు పిలుపునిచ్చారు. బుధవారం ఇక్కడకు వచ్చిన ఏపీ కాపు జేఏసీ నేతలు పట్టణంలోని జనసేన నాయకుడు తోట నగేశ్‌ని కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏసుదాసు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ల పాలనలో కాపుల రిజర్వేషన్ తొలగించి తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు అన్నివిధాలుగా న్యాయం చేసింది తెలుగుదేశం పార్టీయే అని ఆయన అన్నారు. చంద్రబాబునాయుడు కాపులకు రిజర్వేషన్ అమలుచేయడంతో పాటు కాపు కార్పొరేషన్ ఏర్పాటుచేయగా జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వీటిని రద్దు చేయడం జరిగిందన్నారు. కాపులకు న్యాయం జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించి అధికారంలోకి రావాలన్నారు. టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌లకు కాపులంతా ఓట్లేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ రాష్ట్ర నాయకులు ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్, వేమన శ్రీనివాస్, శిద్దా నూకరాజు, మునగాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడండి..!

- దయచేసి బొగ్గు విడుదల చేయండి
- అదానీ పోర్టు నిర్వాసిత కార్మికులకు ఉక్కు ఉన్నతాధికారుల విజ్ఞప్తి
- కాలినడకన వెళ్లి చేతులెత్తి నమస్కారం.. సహకరించలేమన్న కార్మికులు



పోర్టు కార్మికులకు చేతులెత్తి విజ్ఞప్తి చేస్తున్న ఉక్కు ఉన్నతాధికారి

విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గత నెల 12వ తేదీ నుంచి అదానీ గంగవరం పోర్టులో సమ్మె కారణంగా బొగ్గు సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ఉత్పత్తి 80 శాతానికిపైగా పడిపోయింది. తక్షణమే బొగ్గు అందించకపోతే వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లడంతో పాటు తిరిగి కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీనిపై విశాఖ ఉక్కు అధికారుల సంఘం హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చినా జిల్లా యంత్రాంగం ఎటువంటి సహకారం అందించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకోవడం లేదు. అదానీ యాజమాన్యం ముందుకురావడం లేదు. కార్మికులు సమ్మె విరమించడం లేదు. కోర్టు ధిక్కారణ కేసు కూడా నమోదైంది. అయితే ఉత్తర్వులు, ఆదేశాలతో పనులు జరగవని గుర్తించిన స్టీల్‌ప్లాంటు ఉన్నతాధికారులు నేరుగా సమ్మె చేస్తున్న కార్మికులతోనే చర్చించాలని నిర్ణయించారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంటు నుంచి సీజీఎంలు, జీఎంలు, ఇతర ఉన్నతాధికారులు సుమారుగా వేయి మంది బుధవారం ప్లాంటు దగ్గరున్న బాలచెరువు వెనుక గేటు నుంచి పోర్టు వరకు కాలినడకన వెళ్లి అక్కడ సమ్మె చేస్తున్న నిర్వాసిత కార్మికులను కలిశారు. పోర్టు నుంచి బొగ్గు తరలించడానికి సహకరించాలని, లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న ప్లాంటును కాపాడాలని చేతులెత్తి వేడుకున్నారు. అభ్యర్థించారు. దీనికి పోర్టు కార్మికులు నిరాకరించారు. తాము పోర్టు కోసం ఇళ్లను, గ్రామాలను త్యాగం చేశామని, న్యాయం జరగలేదని, కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు బొగ్గును తరలించడానికి అంగీకరించబోమని తెగేసి చెప్పారు. దాంతో అధికారులు నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయం తెలిసి సీఎండీ అతులభట్ జిల్లా అధికారులైన కలెక్టర్, పోలీస్ కమిషనర్లకు లేఖ రాశారు. తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని, బొగ్గు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

క్రైం... crime news

ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని మహిళ మృతదేహం

కశింకోట, మే 8 : మండలంలోని ఉగ్గినపాలెం వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఏఎస్ఐ సుందరమ్మ తెలిపారు. ఈమెకు సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, ప్రమాదవశాత్తు ఏలేరు కాలువలో పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈమె ఎరుపు రంగు జాకెట్టు, గోధుమరంగు చీర ధరించి ఉన్నట్టు తెలిపారు. గ్రామ వీఆర్వో శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. ఆచూకీ తెలిసినవారు కశింకోట పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మే 8: మండలంలోని పి.బోనంగి గ్రామానికి చెందిన డెక్క శ్రీనివాసరావు బుధవారం రాత్రి పరవాడ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 20 క్వార్టర్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బయ్యవరంలో 12 మద్యం బాటిళ్లు ...

కశింకోట : మండలంలోని బయ్యవరం ఒక పాన్‌షాపులో ఉన్న 11 మద్యం క్వార్టర్ బాటిళ్లు, ఒక ఫుల్‌బాటిల్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుని కశింకోట పోలీసులకు అప్పగించారని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

చికెన్ స్టాక్‌పాయింట్‌లో రూ.లక్ష విలువైన కోళ్లు అనుమానాస్పదంగా మృతి



చికెన్ స్టాక్‌పాయింట్‌లో చనిపోయి ఉన్న కోళ్లు

దేవరాపల్లి, మే 8 : మండల కేంద్రం దేవరాపల్లి మెయిన్ రోడ్డులోని చికెన్ స్టాక్‌పాయింట్‌లో సుమారు రూ.లక్ష విలువ చేసే కోళ్లు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. చికెన్ సెంటర్ యజమాని జామి నాయుడు నాలుగు కిలోమీటర్ల దూరంలో గల నాగయ్యపేట గ్రామంలో ఉంటాడు. స్టాక్‌పాయింట్‌లో కోళ్లు మృతి చెందాయని స్థానికులు బుధవారం అతనికి సమాచారం అందించారు. దీంతో అతడు ఉదయాన్నే అక్కడకు చేరుకొని చూసే సరికి కోళ్లు స్టాకు చేసిన మెస్‌కోసి లోపలికి చొరబడి కోళ్లను పీకకోసి చంపేశారని ఆరోపించారు. రెండు నెలల క్రితం కూడా ఇటువంటి ఘటనే జరిగిందని వాపోయాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపాడు.

తాళ్లపాలెం చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

కశింకోట, మే 8 : మండలంలోని తాళ్లపాలెం చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి వాహనాల తనిఖీ వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి వివిధ పార్టీల అభ్యర్థులు నగదు, మద్యం, ఇతర వస్తువులను వినియోగించే అవకాశం ఉందన్నారు. వాటిని అక్రమంగా రవాణా నిర్వహించేందుకు కొత్త మార్గాలను ఎన్నుకుంటున్నారన్నారు. దానికి అనుగుణంగా చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ బి.వి జయభాస్కర్, సీఐ జి.వినోద్‌బాబు ఉన్నారు.

రేపే అప్పన్న నిజరూప దర్శనం

- తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులకు దర్శనాలు



వెండి బొరిగే, ప్రత్యేక పాత్ర

సింహాచలం, మే 8: వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం శుక్రవారం జరగనుంది. చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి దర్శనాలను గురువారం సాయంత్రం 6 గంటలకు నిలిపివేస్తారు. తరువాత దివిటీ సలామ్, దీపారాధన, మూర్తి కలశారాధన, రాత్రి ఆరాధనలు జరిపి సుమారు 11 గంటలకు పవళింపు సేవ చేసి కవాట బంధనం చేస్తారు. శుక్రవారం తెల్లవారుజామున 1 గంటకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొపుతారు. 1.30 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము, రుత్విగ్వరణము, పంచకలశా వాహనం జరుగుతాయి. తరువాత ఆలయ అర్చకులు ఏడాది పొడవునా స్వామివారిపై పూతగా ఉన్న శ్రీచందనోత్తరణను నోటికి గుడ్డలు కట్టుకుని వెండి బొరిగెలతో తొలగించి, ప్రభాత ఆరాధన చేస్తారు. తెల్లవారుజామున 3.00 గంటలకు ఆలయ ధర్మకర్త, వారి కుటుంబ సభ్యులకు తొలి దర్శనం, 3.30 నుంచి 4 వరకు ప్రభుత్వం తరపున, తిరుమల తిరుపతి దేవస్థానం వస్త్ర సమర్పణ, తెల్లవారుజామున 4 నుంచి భక్తులకు సర్వ దర్శనాలు ప్రారంభమవుతాయి. ఉదయం 5 నుంచి 7 వరకు, మధ్యాహ్నం 12 గంటల వరకు స్లాట్లుగా రూ.1500 అతిశ్రీఘ్రదర్శనాలు కల్పిస్తారు. రాత్రి 8.30 గంటలకు గంగధార నుంచి శ్రీవైష్ణవ స్వాములతో సహస్ర ఘటాభిషేకం జరిపి మూడుమణుగుల తొలి విడత చందనం సమర్పిస్తారు. అనంతరం పవళింపు సేవ, కవాట బంధనం చేస్తారు.

దువ్వాడ మీదుగా సికింద్రాబాద్- ఖుర్దారోడ్డు మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మే 8: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా సికింద్రాబాద్- ఖుర్దారోడ్డు మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 07129 నంబరు గల రైలు ఈనెల 10న (శుక్రవారం) సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 9.00 గంటలకు దువ్వాడ, సాయంత్రం 4.30 గంటలకు (శనివారం) కుర్దారోడ్డు చేరుతుంది. తిరిగి ఈనెల 11న (శనివారం) రాత్రి 11.30 గంటలకు ఖుర్దారోడ్డులో బయలుదేరి మర్నాడు ఉదయం 7.15 గంటలకు దువ్వాడ, రాత్రి 10.00 గంటలకు (ఆదివారం) సికింద్రాబాద్ చేరుతుంది. 07131 నంబరు గల రైలు ఈనెల 11న (శనివారం) సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 9.00 గంటలకు దువ్వాడ, సాయంత్రం 4.30 గంటలకు (ఆదివారం) కుర్దారోడ్డు చేరుతుంది. తిరిగి 07132 నంబరు గల రైలు ఈనెల 12న (ఆదివారం) రాత్రి 11.30 గంటలకు ఖుర్దారోడ్డులో బయలుదేరి మర్నాడు ఉదయం 7.15 గంటలకు దువ్వాడ, రాత్రి 10.00 గంటలకు (సోమవారం) సికింద్రాబాద్ చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

పశువులబంద వద్ద ఆనవాళ్లులేని రహదారి



అడుగడుగునా భారీ గోతులు... ఆదివాసీల కష్టాలు

ఐదేళ్లుగా కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రెండు మండలాలను కలిపే చింతపల్లి మండలం పశువులబంద-చౌడుపల్లి ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఆర్టీసీ బస్సు కూడా రద్దు చేశారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల గిరిజన ప్రజలు పశువులబంద-చౌడుపల్లి రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే పశువులబంద నుంచి చౌడుపల్లి వరకు మూడు కిలోమీటర్ల రహదారి పూర్తిగా పాడైపోయింది. రహదారి ఆనవాళ్లు కనిపించడంలేదు. దీంతో ప్రస్తుతం పది కిలోమీటర్లు దూరం పెరిగినప్పటికీ దుశ్చరిపాలెం-వంచుల మార్గంపై రాకపోకలు సాగిస్తున్నారు. పశువులబంద-చౌడుపల్లి ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు పలు మార్లు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నప్పటికీ కనీసం పట్టించుకోలేదు.

అడుగుకో గొయ్యి

గాజువాక ఆటోనగర్ 'డి' బ్లాకులో రహదారులు అడుగుకో గొయ్యితో దర్శనమిస్తుంటాయి. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించే ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, వీఎస్ఈజెడ్‌కు కార్మికులు, గ్రీన్‌సిటీ, దువ్వాడ, ఫకీరుతఖ్యా, యాదవజగ్గరాజుపేట, సత్తివానిపాలెం, నరవ, గవర జగ్గయ్యపాలెం, షీలానగర్ ప్రాంతాల వాసులు చాలా ఇబ్బందిపడుతున్నారు.



గుంతలు పడిన ఆటోనగర్ డి బ్లాకు రహదారులు

ప్రాణాలు కూడా పోతున్నాయ్

పెందుర్తి మండలం వేపగుంట-పినగాడి రహదారి గజానికో గొయ్యితో అధ్వానంగా ఉంది. నగరం నుంచి వేపగుంట మీదుగా చోడవరం వెళ్లేందుకు ఇది దగ్గరి మార్గం. ఈ రహదారి పునరుద్ధరణ కోసం గత ఏడాది స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ రహదారి పక్కన మెటీరియల్ డంప్ చేసి పనులు మొదలుపెట్టి మధ్యలోనే వదిలేశారు. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డుపై ఇటీవల గుంతలో ద్విచక్ర వాహనాలు స్కిడ్ కావడంతో నవ వధువు, మరో మహిళ మృతి చెందారు. కాగా గాయపడిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. గత నెలలో సీఎం జగన్మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఉందని వేపగుంట నుంచి పినగాడి వరకూ కొన్ని పెద్ద గుంతలకు ప్యాచింగ్ పనులు నిర్వహించారు.



గుంతలతో వేపగుంట పినగాడి రహదారి

దారితప్పిన పాలన

గజానికొక గొయ్యి

- దారుణంగా రహదారులు
- ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం

ఉమ్మడి విశాఖ జిల్లాలో వేపగుంట నుంచి సీలేరు వరకూ ఏ ప్రాంతానికి వాహనంలో వెళ్లినా చుక్కలు కనిపిస్తాయి. నడుములు విరిగిపోతాయి. జాతకం బాగా లేకపోతే ప్రమాదం కూడా జరుగుతుంది. ఐదేళ్ల నుంచి ప్రధాన రహదారులకు మరమ్మతులు చేయకపోవడమే ప్రధాన కారణం. ఈ ఐదేళ్లలో వందల కోట్ల రూపాయలు ప్రజల సంక్షేమానికి ఇచ్చామని వైసీపీ ఎమ్మెల్యేలు గొప్పలు చెబుతుంటారు. కానీ శంకుస్థాపనలు చేసిన రహదారులను కూడా పూర్తి చేయలేక చేతులెత్తేశారు. అట్టహాసంగా ప్రారంభించిన రహదారులన్నీ మధ్యలోనే ఆగిపోయాయి. ఇక విశాఖ నగరానికి వస్తే ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నాయకులు నిత్యం తిరిగే రుషికొండ రహదారులు మాత్రం విశాలంగా నిర్మించుకొని, వాటికి లింకు రోడ్లను పట్టించుకోకుండా వదిలేశారు. గ్రామీణ ప్రాంతంలో ఈ పరిస్థితి మరింత దయనీయంగా మారడంతో పలు పల్లెలకు కనీసం 108 వాహనం కూడా చేరుకోలేని దుస్థితి. కనీస మరమ్మతులకు నోచుకోని రోడ్లు చెరువులను తలపించేలా ఛిద్రమైనా రూపాయి కూడా విదల్చలేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని దారుణ దారులపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలన...

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

ఆంధ్రజ్యోతి పరిశీలన

బీచ్ కనెక్టివిటీ రోడ్డుని పట్టించుకోరా...



ఎండాడ నుంచి బీచ్ రోడ్డుకు వయా సన్ కళాశాల మీదుగా వెళ్లే రహదారి దుస్థితి

జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో బీచ్ రోడ్డు నుంచి సన్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల, రాజీవ్‌నగర్, గొల్లల ఎండాడ, ముబారక్ కాలనీ మీదుగా ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డుకు కనెక్టివిటీగా ఉన్న రహదారి గోతులతో సుమారు కిలోమీటరుపైగా అధ్వానంగా ఉంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ బీచ్ కనెక్టివిటీ రోడ్డుకు మరమ్మతులు తప్ప పునర్నిర్మించడంలో పాలకులు విఫలమయ్యారు. ప్రధానంగా అదే మార్గంలో హయగ్రీవ ప్రాజెక్టు నిర్మాణం కోసం భారీ వాహనాలు రాకపోకలు సాధిస్తుండడంతో రహదారి పూర్తిగా ధ్వంసమయ్యింది.

అధ్వానంగా అనకాపల్లి-చోడవరం రోడ్డు



దర్జీనగర్ వద్ద పూర్తిగా తారు లేయర్ లేచిపోయి కిలోమీటరు మేర కంకరతో దర్శనమిస్తున్న అనకాపల్లి - చోడవరం రోడ్డు

జిల్లాలో అత్యంత ముఖ్యమైన అనకాపల్లి-చోడవరం రోడ్డు అత్యంత దారుణంగా ఉంది. ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడ్డాయి. చోడవరం, కోటపాడు, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, మాడుగుల, రావిక మతం, చీడికాడ తదితర మండలాలకు చెందినవారు జిల్లా కేంద్రమైన అనకాపల్లి వచ్చి, వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. అయితే రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఐదేళ్లుగా అనకాపల్లి-చోడవరం రోడ్డు నిర్మాణంపై అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇస్తూ వచ్చినప్పటికీ ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు.

వెంకటాపురం రహదారి అధ్వానం

పరవాడ మండలం వాడచీపురుపల్లి-వెంకటాపురం ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రహదారి పొడవునా పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. రాళ్లు పైకి తేలడంతో ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే వెంకటాపురం, నునపర్తి, రేఖవానిపాలెం, గొల్లగుంట, రావాడ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగేళ్లుగా రహదారి గోతులతో నిండిపోయి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోలేదు.



ధ్వంసమైన వాడచీపురుపల్లి-వెంకటాపురం ప్రధాన రహదారి

లంకెలపాలెం రోడ్డులో ప్రయాణం నరకప్రాయం



అసకపల్లి-లంకెలపాలెం రోడ్డులో వివిధ ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్డు

ముడుకులోతు గోతులు

సబ్బవరం మండలం అసకపల్లి-లంకెలపాలెం రహదారి గోతులమయమైంది. రెండేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉంది. నిత్యం వందలాది లారీలు ఫ్లైయాష్ లోడుతో రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు మరింత ధ్వంసమైపోయింది. అలాగే ఫ్లైయాష్ గాలిలో కలసి కళ్లలో పడుతోందని వాహనచోదకులు, ప్రయాణికులు, ఆటోలు, బస్సుల్లో ప్రయాణించేవాళ్లు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు కానీ, అధికారులు కానీ పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు.



రెడ్డిపల్లిలో అధ్వానంగా మారిన రహదారి

మూడేళ్లుగా సా....గుతున్న విస్తరణ

పద్మనాభం మండలం పద్మనాభం-రెడ్డిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. 2021 మార్చి29న భూమి పూజ చేసి ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. అయితే నేటికీ పూర్తికాలేదు. రెడ్డిపల్లి గ్రామంలో కిలో మీటరు నిడివి కలిగిన రోడ్డయితే చాలా అధ్వానంగా ఉంది. ఈరోడ్డు విస్తరణ కారణంగా తాగునీటి పైపులైను పనులు పునరుద్ధరించకపోవడంతో గత ఏడాది నుంచి గ్రామానికి తాగునీరు కూడా లేకుండాపోయింది. టీడీపీ హయాంలో పద్మనాభం-శొంఠ్యాం, పద్మనాభం-మహారాజ్‌పేట రోడ్లను పూర్తిచేయగా ఐదేళ్ల వైసీపీ పాలనలో అతి తక్కువ నిడివి ఉన్న రోడ్డును కూడా పూర్తి చేయకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రెడ్డిపల్లిలో గోతులమయంగారోడ్డు

ఇదీ అంతర్రాష్ట్ర రహదారి!



లంకపాకలు బ్రిడ్జి వద్ద అధ్వానంగా తయారైన రహదారి

గూడెంకొత్తవీధి మండలం ఆర్వీనగర్ నుంచి నూతిబంద వరకు గల అంతర్‌రాష్ట్ర రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం కనీసం గుంతలను కూడా పూడ్చలేదు. ఈ అంతర్రాష్ట్ర రహదారి ఒడిశా, తెలంగాణ, చత్తీస్‌గడ్ రాష్ట్రాలను కలుపుతుంది. 2018 టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండు లైన్ల రహదారిగా నిర్మాణానికి రూ.84 కోట్లు మంజురయ్యాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ నిధులు మరుగునపడిపోయాయి. ప్రస్తుతం ఆర్వీనగర్ నుంచి నూతిబంద వరకు సుమారు 12 కిలోమీటర్ల రహదారి అత్యంత అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పడం లేదు.

ఏడు గ్రామాల ప్రజలకు నరకం

108 కూడా నిలిచిపోయింది

రావికమతం మండలం కొట్నాబిల్లి రింగురోడ్డు ఎనిమిది గ్రామాలకు ఆధారం. మండలంలో చినపాచిల కాటా నుంచి టి.అర్జాపురం వరకూ ఉన్న 12 కిలోమీటర్ల ఈ రింగ్ రోడ్డు ద్వారానే మండల కేంద్రానికి, అటు కొత్తకోటకు జనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. 2009లో మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. అది ఎంతో కాలం నిలవలేదు. కొట్నాబిల్లి పంచాయతీ పరిధిలో ఉన్న గ్రానైట్ నిక్షేపాలను భారీ వాహనాలతో తరలించడంతో ఈ రహదారి పూర్తిగా ఛిద్రమైంది. దీంతో అత్యవసర మైన 108 వాహన సేవలు కూడా నిలిచిపోయాయి.



కొట్నాబిల్లి -అర్జాపురం మధ్యలో రాళ్లుతేలిన రహదారి

అధ్వాన్నంగా బీఎన్ రోడ్డు



తేలికపాటి కురిసిన వర్షానికే పూర్తిగా బురదమయంగా మారిన తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బీఎన్ రోడ్డు

నిత్యం ఈ రహదారి గుండా అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు

రోలుగుంట మండలంలో బీఎన్ రోడ్డు (చోడవరం-భీమునిపట్నం రోడ్డు) గత ఐదేళ్లుగా మరమ్మతులు లేక అధ్వానంగా తయారైంది. స్థానిక వెలంకాయలపాలెం నుంచి రోలుగుంట, కొత్తకోట వరకూ రోడ్డు గోతులమయంగా మారింది. రోలుగుంట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ రహదారిగుండా అనేక గ్రామాల ప్రజలు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

బీఎన్ రోడ్డులో తీరని ఇబ్బంది



చోడవరం-వెంకన్నపాలెం రోడ్డులో అంభేరుపురం వద్ద అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి దుస్థితి

చోడవరం నియోజకవర్గంలో ప్రధానమైన బీఎన్ రోడ్డును ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పునర్నిర్మించలేకపోయింది. రూ.113 కోట్లతో చేపట్టిన పనులను పూర్తి చేయించలేకపోయింది. అన్నివర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఎన్నికలు వేళ ప్రధాన రహదారిపై తాత్కాలికంగా తారుపూతలు వేసి మమ అనిపించింది. కానీ చోడవరం-వెంకన్నపాలెం రోడ్డు మధ్యలో అంభేరుపురం వద్ద రోడ్డు ఇప్పటికీ అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో కనీసం గోతులు పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

బీజేపీలో చేరిన మాడుగుల వైసీపీ నేతలు



పార్టీలో చేరిన మాడుగుల వైసీపీ శ్రేణులతో బీజేపీ నేతలు

కొత్తూరు, మే 8: మాడుగుల నియోజకవర్గం వైసీపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. మాడుగుల వైసీపీ మహిళా అధ్యక్షురాలు పైలా అమ్మాజీ, మాజీ సర్పంచ్ తమరన దాలినాయుడు, కిషోర్‌నాయుడు, సుంకర నాగేశ్వరరావులకు ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ పార్టీలోకి చేరిన ప్రతి నాయకునికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, రాష్ట్ర నాయకులు సురేంద్రమోహన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకే ఎంఆర్‌పీఎస్ మద్దతు

తుమ్మపాల, మే 8: కూటమి పార్టీల అభ్యర్థులకే ఎంఆర్‌పీఎస్ మద్దతును తెలియజేస్తున్నట్టు ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎలకబిల్లి కనకఅప్పారావు, చెవ్వేటి అచ్యుతరావు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం భీమునిగుమ్మంలో కొణతాల రామకృష్ణకు మద్దతునిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొలుత బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమని ఎంఆర్‌పీఎస్ నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు చెవ్వేటి శ్రీనివాసరావు, పెట్ల మహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం అమావాస్య జాతర



పాల్తేరులో తలుపులమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

పాయకరావుపేట రూరల్, మే8 : మండలంలోని పాల్తేరు, రాజగోపాలపురం, సత్యవరం, తదితర గ్రామాలలో బుధవారం గంధం అమావాస్య సందర్భంగా అమ్మవారి జాతరలు ఘనంగా జరుపుకున్నారు. పాల్తేరు సమీపంలోని కడిమి చెరువు గట్టు మీద వెలిసిన తలుపులమ్మ తల్లి అమ్మవారిని భారీగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త దేవవరపు వెంకటరావు కుటుంబ సభ్యులతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని తుని మాజీ శాసనసభ్యులు రాజా అశోక్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ, జనసేన నాయకులు దేవవరపు రాజబాబు, దేవవరపు రఘు, మాజీ సర్పంచ్ దేవవరపు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఎస్.రాయవరంలో.. గంధం అమావాస్య సందర్భంగా ఎస్.రాయవరం, కొరుప్రోలు గ్రామాల్లో బుధవారం నూకాంబిక అమ్మవార్ల జాతరలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్ల ఘటాలను గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివెళ్లి నూకాంబిక అమ్మవార్లకి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆలయాల వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ఎస్.రాయవరం, మే 8: మండలంలోని బంగారమ్మపాలెం, ఎస్.రాయవరం, రేవుపోలవరం, తిమ్మాపురం, దార్లపూడి గ్రామాల్లో బుధవారం సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో జరిగే ఎన్నికల్లో భాగంగా కవాతు నిర్వహించినట్టు చెప్పారు.

హామీలే తప్ప అమలు ఏది?

... 5వ పేజీ తరువాయి

జీవనం సాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో చదువుకోవడానికి బడి లేదు. ఆయా గ్రామాల్లో 50కి పైగా మంది బడిఈడు పిల్లలు ఉన్నారు. వీరు చదువుకోవడానికి బడికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు కొండ దిగి వైబీపట్నం పాఠశాలకు వెళ్లాలి. దీంతో వెళ్లలేక చదువుకు దూరమవుతున్నారు.

ధర్మశ్రీ హామీలు నీటి మూటలే..

గత ఎన్నికల సమయంలో మండలంలోని లోసింగి, పెదగరువు, పిత్రిగెడ్డ, కొత్తలోసింగి గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన కరణం ధర్మశ్రీ ఎన్నో హామీలు ఇచ్చారు. రహదారి సౌకర్యం, తాగునీరు, బడి ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారు. అయితే గెలిచిన తరువాత ఆ హామీలను మరిచిపోయారు. కాగా రెండేళ్ల క్రితం మళ్లీ ఆయా గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో గుర్రమెక్కి కొండలు దాటుకుని ఆయా గ్రామాలను సందర్శించారు. గిరిజనులతో సమావేశమై ఏ సమస్యలు ఉన్నాయో చెప్పండి అంటూ మళ్లీ పాత పాటే పాడారు. ఆరు నెలల్లో మీకు రహదారి సౌకర్యం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని మళ్లీ హామీ ఇచ్చారు. అయితే ఆ హామీలు కూడా నెరవేరలేదు. ఈ ఐదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, ఈసారి ఎన్నికల ప్రచారానికి వస్తే గట్టిగా నిలదీయడానికి సిద్ధంగా ఉన్నామని గిరిజనులు చెబుతున్నారు.

డోలీ మోత తప్పడం లేదు



ఎన్నో ఏళ్ల నుంచి మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత ఎన్నికల ప్రచారంలో మా గ్రామాలకు ఎమ్మెల్యే ధర్మశ్రీ వచ్చి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేర్చలేదు. వైద్య సౌకర్యం కూడా లేకపోవడంతో ఏ సమస్య వచ్చినా డోలీ మోత ద్వారా ఆస్పత్రికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈసారి మా సమస్యలు పరిష్కరించేవారికే ఓట్లు వేస్తాం.

\- నరసయ్య, పెదగరువు

జిల్లాలో ఇద్దరికి పాలీసెట్‌లో స్టేట్ ఫస్టు ర్యాంక్

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వ ఉద్యోగాలు. ప్రస్తుతం వీరి కుటుంబం విశాఖపట్నంలో నివాసం ఉంటున్నది. ఈ సందర్భంగా జ్ఞానహర్షిత విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి మార్కుల ఆధారంగా ట్రిబుల్ ఐటీలో చేరాలనుకుంటున్నట్టు చెప్పింది. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన హర్షితను పలువురు అభినందించారు. కాగా పాయకరావుపేట లింగాలతోటకాలనీలో నివాసముంటున్న శీలం శ్రీను కుమారుడు శ్రీరామ్ భవదీప్ సంగివలస విద్యా సంస్థల్లో చదువుతున్నాడు. శ్రీరామ్ తండ్రి కాకినాడ జిల్లా అన్నవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి ఫణిశ్రీ గృహిణి. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఐఐటీలో సీటు సాధించి ఇంజనీరింగ్ చదవాలన్నది తన లక్ష్యమని తెలిపాడు.

కొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు

» టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, మే 8: కొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు రానున్నాయని టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని గుర్రాజుపేట, రామయ్యపట్నం, ధర్మవరం అగ్రహారం, సోముదేవుపల్లి, పెదగుమ్ములూరు గ్రామాల్లో బుధవారం ఉదయం, రాత్రి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై పూర్తిగా విసుగుచెందిన ప్రజలందరూ ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపేందుకు ఓటు అనే ఆయుధంతో సిద్ధంగా ఉన్నారన్నారు. ముందుగా గ్రామాలకు వచ్చిన అనితకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామాల్లో ప్రచారం చేసిన అనిత వైసీపీ అరాచక పాలన గురించి, జరిగిన నష్టం గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జరిగే మంచి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు సైకిల్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని అనిత ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, నాయకులు ఎన్. వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, సుంకర శ్రీనివాసరావు, కురందాసు శ్రీను తదితన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



గుర్రాజుపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగలపూడి అనిత

జనం మీద పడి బతికే నాయకుడు ఎందుకు?

» టీవీ సీరియల్ హీరో నిరుపమ్

జనం బతకాలని కోరుకునే నాయకుడు కావాలి గాని జనం మీద పడి బతికే నాయకుడు వద్దంటూ టీవీ సీరియల్ హీరో నిరుపమ్ (డాక్టర్ బాబు) ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. మండలంలోని సోముదేవుపల్లిలో బుధవారం రాత్రి టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో టీవీ సీరియల్ హీరో నిరుపమ్, మంజుల దంపతులు సందడి చేశారు. ఈ సందర్భంగా నిరుపమ్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అనితకు సైకిల్ గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి వారిద్దరినీ గెలిపించాలని నిరుపమ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కోడలు పూజ పాల్గొన్నారు.

గ్రామాల్లో విజయకుమార్‌కు ఆదరణ

అచ్యుతాపురం, మే 8: మండలంలోని గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా నాయకులు బుధవారం ప్రచారం చేశారు. నునపర్తిలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు అపూర్వ ఆదరణ లభించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత రెడ్డి నగేష్, సర్పంచ్ చుక్క అనూరాధ, గొంప నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలో కూటమి శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నమూనా ఈవీఎంలుతో ఓటు ఎలా వేయాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు రమణ, ద్వారపురెడ్డి బాపు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖాజీపాలెంలో పీలా తులసీరాం, సందీప్ ఆధ్వర్యంలో నమూనా ఈవీఎంలతో కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు.

జనసేన పార్టీలో చేరికలు

ఎలమంచిలి: మునిసిపాలిటీలోని పెదపల్లి వార్డులో వైసీపీకి చెందిన బొద్దప రాజ్‌కుమార్‌తో పాటు యువకులు జనసేన పార్టీలో చేరినట్టు జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను తెలిపారు. జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించినట్టు తెలిపారు. కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు.



నునపర్తిలో విజయకుమార్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

» జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, మే 8 : సంక్షేమ పథకాలకు దివంగత నందమూరి తారక రామారావు ఆద్యుడని, జగన్ ఒక్కరే ఏవో పథకాలు అమలు చేస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్నాడని జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని పెదనాయుడుపాలెం, గోపాల్‌నగర్, ఇరువాడ, పైడివాడ, గొల్లలపాలెంల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పైడివాడ సభలో ఆయన మాట్లాడుతూ.. జగన్ తన హయాంలో పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు, అమలు చేయని మద్య నిషేధంపై గురించి చెప్పరేం అని ప్రశ్నించారు. మంచినీరు దొరకని గ్రామాలున్నాయి కానీ, మద్యం దొరకని గ్రామం ఏదైన ఉందాని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వస్తే సామాజిక పింఛన్లు రూ.4 వేలు, వికలాంగుల పింఛన్లు రూ. 6 వేలుతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. జగన్ హయాంలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, దాన్ని చక్కదిద్దే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. తనకు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండి వంశీదీప్, ఇందలి రమణ, దాసరి రమణ, కన్నారావు, సీరం అప్పలరాజు, దుర్గినాయుడు, పోతల కనకరాజు పాల్గొన్నారు.

కూటమి మేనిఫెస్టోతో జగన్‌కి వణుకు: 'పంచకర్ల'

పెందుర్తి: కూటమి మేనిఫెస్టో చూసి సీఎం జగన్‌కు వణుకు పుట్టిందని, ఏపీ హ్యాపీగా ఉండాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పాపయ్యరాజుపాలెం, రాజయ్యపేట, సరిపల్లి, జంగాలిపాలెం, కరకవానిపాలెంలలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. అడుగడుగునా ఆయనకు స్థానికులు పూలమాలలు వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలన సాగించిన జగన్‌కు ఇవే ఆఖరి ఎన్నికలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతుందన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆరు నెలల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి నారాయణరావు, కంచిపాటి మధు, పిన్నింటి పార్వతి, కరక దేవుడు, గొర్లె రామకృష్ణ జగన్నాథం, జి.నరసింగరావు, గొర్లె రమేశ్, శివ పాల్గొన్నారు.



పైడివాడలో సభలో ప్రసంగిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద గందరగోళం

» ఫారం-12 ఇచ్చినా అనకాపల్లికి రాని ఓట్లు

» బ్యాలెట్ పత్రాలు రాలేదని తెలిపిన అధికారులు

» ఓటు హక్కును వినియోగించుకోకుండా వెనుదిరిగిన వైద్య శాఖ ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, మే 8 : అనకాపల్లి గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో బుధవారం గందరగోళం పరిస్థితి నెలకొంది. ఇతర జిల్లాల వారు ఇక్కడ ఓటు వేసేందుకు ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేయడంతో పలు ప్రాంతాల నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. అయితే వారు బ్యాలెట్ పేపర్లు తమ కేంద్రానికి రాలేదని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. తాము ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనకాపల్లి పోలింగ్ కేంద్రానికి వెళ్లమని అధికారులు సూచించారని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చెబుతున్నారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఫారం-12 ఇచ్చినప్పటికీ తమ కేంద్రానికి మీకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు రానందున ఎక్కడైతే దరఖాస్తు చేశారో అక్కడకు వెళ్లి ఓటు వేయాలని స్థానిక ఎన్నికల అధికారులు సూచించారు. దీంతో ఓటు వేయడానికి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది వెనుదిరిగారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

» ఓటు వేసిన అనకాపల్లి, పాయకరావుపేట ఆర్‌ఓలు జాహ్నవి, గీతాంజలి

అనకాపల్లి టౌన్, మే 8 : స్థానిక గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులు పాటు జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ బుధవారం సాయంత్రంతో ముగిసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్, అనకాపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాహ్నవి ఇతర జిల్లాలో ఓటు ఉన్న వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లో ఆమె తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే పలువురు పోలీస్ అధికారులు కూడా ఓటు వేశారు. ఈ మూడు రోజులు పాటు మొత్తం 3,518 ఓటర్లకు గాను 3,132 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పట్టణ సీఐ జి. శంకరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మహ్మద్‌అలీ, రమణ, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.





పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేసిన అనకాపల్లి ఆర్వో జాహ్నవి, గీతాంజలి

ఎలమంచిలిలో.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. చివరి రోజు 310 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2,413 పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల గాను, 2,116 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో 1,536 మంది ఓటర్లకు గాను, 1,408 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా ఇతర జిల్లాల 877 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట ఓటర్లకు 708 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటి రోజు 834 మంది, రెండవ రోజు 972 మంది, 3వ రోజు 310 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

నక్కపల్లిలో.. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాయకరావుపేట నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 88.7 శాతం పూర్తయినట్టు ఆర్ఓ గీతాంజలి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. నియోజవర్గంలోని నాలుగు మండలాలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన వారితో కలిపి 2,392 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయని, వీటిలో 2,122 మంది(88.7శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

అనుకున్నదొక్కటి...!

... 5వ పేజీ తరువాయి

సమయానికి ఆ సంఖ్య 52 వేలకు, ప్రస్తుతం 48 వేలకు తగ్గిపోయిందని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఖాళీల భర్తీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శిస్తున్నారు. టీడీపీ హయాంలో 3,600 డ్రైవర్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలను సిద్ధం చేశారని, వైసీపీ వచ్చిన తరువాత దానిపై కదలిక లేదని నిట్టూరుస్తున్నారు. పైగా ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు బడ్జెట్ కేటాయింపులు నిలిపివేసి, అద్దె బస్సుల సంఖ్యను పెంచడం ద్వారా ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఉద్యోగులు, కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలోని ఇతర శాఖలతో పోల్చితే ఆర్టీసీలోనే ఉద్యోగుల మరణాలు ఎక్కువని, ప్రతి నెలా సగటున 26 నుంచి 29 మంది వివిధ కారణాలతో మృత్యువాతపడుతున్నారన్నారు. కేన్సర్, పక్షవాతం, అంగవైకల్యం వంటి వాటికి గురైనవారికి మాత్రమే కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించి, ఇతరత్రా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారిని నిర్లక్ష్యం చేస్తోందని ఉద్యోగ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. అనారోగ్య కారణాలతో డ్రైవర్, మెకానిక్ వంటి ఉద్యోగాలకు అన్‌ఫిట్‌గా మారుతున్నారని, అలాంటివారు రాష్ట్రవ్యాప్తంగా 220 మంది ఉన్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు.

వైసీపీ స్వార్థానికి బార్క్ నిర్వాసితులు బలి

... 5వ పేజీ తరువాయి

చేయాలని ఆదేశించింది. ఎవరు సాగుచేస్తున్న భూముల్లో వారిని పెట్టి, ఫొటోలు తీసి 632 మంది నిర్వాసితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. పరిహారం పంపిణీ చేసే సమయానికి ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో వైసీపీ నాయకులు కేవలం 132 మందితో కొత్త జాబితాను తయారు చేశారు. ఇందులో పది మంది బినామీలు కూడా ఉన్నారు. గత సంవత్సరం జూలై 29న ఈ జాబితాను పంచాయతీ కార్యాలయంలో పెట్టారు. ఇవి తప్పుల తడకలుగా ఉన్నాయని కొందరు లబ్ధిదారులతో పాటు టీడీపీ నాయకులు ఎదురు తిరిగారు. ఎన్నికలకు ముందు పంపిణీ చేయాలని వైసీపీ నాయకులు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. గత సంవత్సరం అక్టోబరు 29న మళ్లీ గ్రామ సభ పెట్టి పరిహారం పంపకం ప్రారంభించాలని జేసీ, ఆర్డీవో, తహసీల్దార్ తంతడి వెళ్లారు. టీడీపీ, వైసీపీ నాయకులు బాహాబాహీకి దిగడంతో గ్రామసభ వాయిదా పడింది. తరువాత కూడా ఆర్డీవో, తహసీల్దార్ వచ్చి నిర్వాసితులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. కానీ వీలు పడలేదు.

అసలైన లబ్ధిదారులకు అన్యాయం

రాజానపాలేనికి చెందిన మాజీ సైనికోద్యోగి రాజాన అప్పలనాయుడుకి సర్వే నంబర్ 246/2, పట్టా నెంబర్ 301 ప్రకారం 4.70 ఎకరాల భూమి ఇచ్చారు. ఆయన అక్కడే రాజాన రాజేష్ నాయుడు స్మృతి పేరుతో గృహాన్ని నిర్మించుకొని, తన కిచ్చిన భూమిలో జీడిమామిడి తోట పెంచుకున్నారు. ఆయనకు కేవలం 1.49 ఎకరాల్లో జీడితోటలున్నాయని వైసీపీ నాయకులు రికార్డుల్లో నమోదు చేయించారు. పైల ముత్యాలమ్మకు సర్వే నంబరు 131లో పట్టా నంబరు 252/4 ప్రకారం 52 సెంట్ల భూమి ఉంది. కానీ నిర్వాసితుల జాబితాలో ఆమె పేరు లేదు. అలాగే పైల రాముకి ఎకరా భూమి ఉంది. కానీ అతని పేరు కూడా నిర్వాసితుల జాబితాలో లేదు. వీటిని టీడీపీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇవి కొన్ని మాత్రమేనని బహిరంగ విచారణ జరిపితే ఇలాంటివి చాలా ఉన్నాయని నిర్వాసితులతో పాటు టీడీపీ నాయకులు అధికారులకు వివరించారు. దీంతో ఐదుగురు సభ్యులతో కమిటీ వేసి నిజ నిర్ధారణ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయినా ఎన్నికల ముందు వైసీపీ నాయకులు తయారు చేసిన జాబితా ప్రకారం పరిహారం పంపిణీ చేసేద్దామని అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. దీనిని గమనించిన కొందరు నిర్వాసితులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. దీంతో పరిహారం పంపిణీ ఆగిపోయింది. ఈలోగా ఎన్నికల కోడ్ వచ్చింది. కాగా పేద నిర్వాసితులంతా ఇప్పుడు రోడ్డున పడ్డారు. టీడీపీ హయాంలో జాబితాలు తయారైన తరువాత తమకు పరిహారం త్వరలోనే అందుతుందన్న ఉద్దేశంతో రైతులు తాము సాగుచేసుకుంటున్న కొండలను అధికారులకు అప్పగించేశారు. దీంతో ఏపీఐఐసీ అధికారులు ఈ కొండలను బార్క్‌కి అప్పగించారు. బార్క్ ఈ రెండు కొండల చుట్టూ భారీ ప్రహరీ గోడ నిర్మించింది. దీంతో రైతులు రెంటికీ చెడ్డ రేవడిలా మిగిలారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

కొత్తూరు, మే 8 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. బుధవారం వారు కొత్తూరు మేజర్ పంచాయతీలోను, కశింకోట మండలం విస్సన్నపేట, వెదురుపర్తి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

'కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం'

అనకాపల్లి టౌన్,మే 8 : ఇండియా కూటమిని గెలిపిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని జగన్ చెప్పి మాట తప్పారన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అనకాపల్లి జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ పరిధిలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఐఆర్ గంగాధర్ (అనకాపల్లి), బొడ్డు శ్రీనివాస్ (మాడుగుల), రుత్తల శ్రీరామ్మూర్తి (నర్సీపట్నం), తనకాల అనంత నరసింగరావు (ఎలమంచిలి), డాక్టర్ తాతారావు (పాయకరావుపేట), భగత్ (పెందుర్తి) పాల్గొన్నారు.

పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు

అనకాపల్లి టౌన్, మే 8 : స్థానిక ఏఎంఏఎం రోటరీ కంటి ఆస్పత్రిలో బుధవారం ఎనిమిది మంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించినట్టు కంటి ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు. సోమవారం 42 మంది కంటి పరీక్షలకు హాజరు కాగా.. నేత్ర వైద్య సహాయకురాలు పి.దేవి పరీక్షలు నిర్వహించి, ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారన్నారు. దీంతో కంటి వైద్యులు డాక్టర్ కె. మల్లేశ్వరరావు వీరికి ఆపరేషన్లు నిర్వహించారన్నారు. వారికి ఐదు రోజులకు మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

ఆలిండియా ఇంటర్ 'వర్సిటీ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు డీవీఎన్ కళాశాల విద్యార్థి ఎంపిక

అనకాపల్లి టౌన్, మే 8 : ఈనెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తమిళనాడులో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు డీవీఎన్ కళాశాల విద్యార్థి బి. బాల సాయిచరణ్ ఎంపికయినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ తెలిపారు. బాల సాయిచరణ్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడని, ఈ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన బాల సాయిచరణ్‌ను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

» అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ ఎంవీ.మాణిక్యాలు



ఎంవీ.మాణిక్యాలుకు జ్ఞాపిక అందజేస్తున్న విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, మే 8 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోను రాణించాలని అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ (ఒలింపియాడ్) ఎంవీ.మాణిక్యాలు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో 15 రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఎంవీ.మాణిక్యాలు మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు వివిధ క్రీడా అంశాలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎంవీ మాణిక్యాలు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (రిటైర్డ్) ఎన్.సూర్యారావులను శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్ ప్రకాష్ జ్ఞాపికలతో సత్కరించారు.

'పేట'లో కూటమి నాయకుల ప్రచారం

పాయకరావుపేట, మే 8 : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌లకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు అన్నారు. బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పట్టణంలోని పండరీపురం, దుర్గాలమ్మచెట్టు, బృందావనం తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి బ్యాలెట్ నమూనా పత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, చిక్కాల శ్రీను, గూటూరు శ్రీనివాసరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు అచంట దొర, బీఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జడ్.చింతువాలో జనసైనికులు బైక్ ర్యాలీ

రాంబిల్లి, మే 8: ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బుధవారం జడ్.చింతువా పంచాయతీలో జనసైనికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. లోవపాలెం శివారు తోటవీధి నుంచి లోవపాలెం కాలనీ, జగిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం మీదుగా కొండవారపాలెం వరకు బైకులపై ర్యాలీ నిర్వహించి, ఎన్నికల ప్రచారం చేశారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు భోగిలక్ష్మి, జనసేన నాయకులు జి.రాజు, వెంకటరమణ, చెల్లూరి కొండబాబు, ఎరిపల్లి సత్తిబాబు, ఎం. వెంకన్న, చెల్లూరి దేముడు, సత్తిబాబు, అప్పలరాజు, దానయ్య కనకరాజు పాల్గొన్నారు.

'నూకాంబిక' హుండీ ఆదాయం రూ. 66.69లక్షలు

అనకాపల్లి టౌన్, మే 8: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారి హుండీ లెక్కింపు జరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీ నుంచి మే నెల ఏడో తేదీ వరకు మొత్తం 77 రోజులకు రూ. 66 లక్షల 69వేల 415 భక్తులు కానుకల రూపంలో సమర్పించారని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. అలాగే 31 గ్రాముల బంగారం, ఒక కిలో 700 గ్రాముల వెండి భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కుబడుల రూపంలో సమర్పించారన్నారు. జిల్లా దేవదాయ శాఖ అధికారిణి కె.ఎల్. సుధారాణి, అనకాపల్లి దేవదాయ శాఖ తనిఖీదారుడు ఎం.శ్రీధర్ పర్యవేక్షణలో లెక్కింపు జరిగిందన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

పాయకరావుపేట, మే 8 : 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. తమ కళాశాలలో రెండేళ్ల కోర్సు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్ మెన్ సివిల్‌తో పాటు ఏడాది కోర్సులు కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, మెకానికల్ డీజిల్ కోర్సులు ఉన్నాయన్నారు. పదో తరగతి పరీక్ష పాసై ఆసక్తి గల విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో తమ కళాశాలలో సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ పోర్టల్ నందు అప్లై చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

ఎన్నికల విధులకు 9 మంది ట్రైనీ ఐపీఎస్‌లు

అనకాపల్లి రూరల్, మే 8: జిల్లాలో జరిగే సార్వత్రిక ఎన్నికల విధులకు నేషనల్ పోలీస్ అకాడమీకి చెందిన తొమ్మిది మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు జిల్లాకు వచ్చారు. వీరికి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఎన్నికల బందోబస్తు విధులతో పాటు భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ట్రైనీ ఐపీఎస్ అర్జున్‌గుప్తా, అర్పిత్ ఆర్ పారేక్, శుభాన్షు కత్యార్, హర్షిత్ గోయల్, హుస్సేన్ లిరార్, జతిన్ జైన్, గౌతమ్ వివేకానందన్, పెమ తిన్లే, వైభవ్ రావత్ ఎన్నికల విధుల్లో పాల్గొని శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేస్తారని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. పోలింగ్ రోజు వరకు ఎన్నికల విధుల్లో కొనసాగుతారన్నారు.

మూడో రోజు 350 ఓట్లు

» ప్రశాంతంగా సాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ » నేడూ అవకాశం



చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు వేసేందుకు ఉద్యోగులు క్యూ

మాడుగుల, మే 8 : పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాల పోలింగ్ కేంద్రంలో మూడవరోజు బుధవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో 350 ఓటు పోలయ్యాయని ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రాజా తెలిపారు. మొత్తం 2465 ఓట్లకు గాను తొలిరోజు 735, రెండోరోజు 1120, మూడో రోజు 350 ఓట్లు పోలైనట్టు చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణి, పోలింగ్ నోడల్ అధికారిణి ఈశ్వరమ్మ, తహసీల్దార్ టి.సత్యనారారాయణ పర్యవేక్షించారు. ఇదిలావుంటే, మూడు రోజులపాటు జరిగిన పోలింగ్‌లో అన్ని శాఖలకు చెందిన ఉద్యోగుల వారి ఓటు హక్కుని వినియోగించుకున్నారని, నాల్గోరోజు పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి మాత్రమే ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసుకునే వెసులుబాటు కల్పించారని డీటీ రాజా వివరించారు.

చోడవరంలో...

చోడవరం, : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రంలో మూడో రోజు బుధవారం పలువురు ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్‌ను తొలుత మూడు రోజులపాటే నిర్వహించాలని ఎన్నికల అధికారులు నిర్ణయించారు. అనంతరం గురువారానికి కూడా పొడిగించడంతో మిగిలిన ఉద్యోగులకు ఓటు వేసే అవకాశం లభించనుంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీలు, ఇతర ప్రాంతాల నుంచి ఎన్నికల విధుల కోసం వచ్చిన వారి కోసం స్థానికంగా ఆరు బూత్‌లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా చోడవరం పోలింగ్ కేంద్రంలో మొత్తం 2579 ఓట్లుకు గాను, తొలిరోజు 923, రెండవ రోజు 1186 ఓట్లు పోలయ్యాయి. కాగా కొత్తగా మరికొందరు పోస్టల్ బ్యాలట్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో మరో 50 వరకూ ఓట్లు పెరిగే అవకాశం ఉన్నట్టు అంచనా.

హామీలే తప్ప అమలు ఏది?

... 5వ పేజీ తరువాయి

జీవనం సాగిస్తున్నారు.

బడి లేక బాలలు చదువుకు దూరం

ఆయా గ్రామాల్లో చదువుకోవడానికి బడి లేదు. ఆయా గ్రామాల్లో 50కి పైగా మంది బడిఈడు పిల్లలు ఉన్నారు. వీరు చదువుకోవడానికి బడికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు కొండ దిగి వైబీపట్నం పాఠశాలకు వెళ్లాలి. దీంతో వెళ్లలేక చదువుకు దూరమవుతున్నారు.

ధర్మశ్రీ హామీలు నీటి మూటలే..

గత ఎన్నికల సమయంలో మండలంలోని లోసింగి, పెదగరువు, పిత్రిగెడ్డ, కొత్తలోసింగి గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన కరణం ధర్మశ్రీ ఎన్నో హామీలు ఇచ్చారు. రహదారి సౌకర్యం, తాగునీరు, బడి ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారు. అయితే గెలిచిన తరువాత ఆ హామీలను మరిచిపోయారు. కాగా రెండేళ్ల క్రితం మళ్లీ ఆయా గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో గుర్రమెక్కి కొండలు దాటుకుని ఆయా గ్రామాలను సందర్శించారు. గిరిజనులతో సమావేశమై ఏ సమస్యలు ఉన్నాయో చెప్పండి అంటూ మళ్లీ పాత పాటే పాడారు. ఆరు నెలల్లో మీకు రహదారి సౌకర్యం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని మళ్లీ హామీ ఇచ్చారు. అయితే ఆ హామీలు కూడా నెరవేరలేదు. ఈ ఐదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, ఈసారి ఎన్నికల ప్రచారానికి వస్తే గట్టిగా నిలదీయడానికి సిద్ధంగా ఉన్నామని గిరిజనులు చెబుతున్నారు.

డోలీ మోత తప్పడం లేదు

- నరసయ్య, పెదగరువు



ఎన్నో ఏళ్ల నుంచి మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత ఎన్నికల ప్రచారంలో మా గ్రామాలకు ఎమ్మెల్యే ధర్మశ్రీ వచ్చి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేర్చలేదు. వైద్య సౌకర్యం కూడా లేకపోవడంతో ఏ సమస్య వచ్చినా డోలీ మోత ద్వారా ఆస్పత్రికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నేళ్లయినా మా కష్టాలు తీరడం లేదు. ఈసారి మా సమస్యలు పరిష్కరించేవారికే ఓట్లు వేస్తాం.

హామీలు ఇచ్చి మరిచారు

- కె.గోవిందరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు



గత ఎన్నికల సమయంలో రోడ్డు సౌకర్యం కల్పిస్తానని కరణం ధర్మశ్రీ హామీ ఇచ్చారు. అలాగే రెండేళ్ల క్రితం గడప గడపకు కార్యక్రమంలో పాల్గొని ఆరు నెలల్లో రోడ్డు సౌకర్యం, పాఠశాలను ఏర్పాటు చేస్తామని మళ్లీ హామీ ఇచ్చి మాట తప్పారు. ఈ గిరిజన గ్రామాల్లో ఈ ఐదేళ్లల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఈ ప్రభుత్వం, ఎమ్మెల్యే ధర్మశ్రీ పూర్తిగా విఫలమయ్యారు.

వైసీపీ స్వార్థానికి బార్క్ నిర్వాసితులు బలి

... 5వ పేజీ తరువాయి

చేయాలని ఆదేశించింది. ఎవరు సాగుచేస్తున్న భూముల్లో వారిని పెట్టి, ఫొటోలు తీసి 632 మంది నిర్వాసితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. పరిహారం పంపిణీ చేసే సమయానికి ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో వైసీపీ నాయకులు కేవలం 132 మందితో కొత్త జాబితాను తయారు చేశారు. ఇందులో పది మంది బినామీలు కూడా ఉన్నారు. గత సంవత్సరం జూలై 29న ఈ జాబితాను పంచాయతీ కార్యాలయంలో పెట్టారు. ఇవి తప్పుల తడకలుగా ఉన్నాయని కొందరు లబ్ధిదారులతో పాటు టీడీపీ నాయకులు ఎదురు తిరిగారు. ఎన్నికలకు ముందు పంపిణీ చేయాలని వైసీపీ నాయకులు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. గత సంవత్సరం అక్టోబరు 29న మళ్లీ గ్రామ సభ పెట్టి పరిహారం పంపకం ప్రారంభించాలని జేసీ, ఆర్‌డీవో, తహసీల్దార్ తంతడి వెళ్లారు. టీడీపీ, వైసీపీ నాయకులు బాహాబాహీకి దిగడంతో గ్రామసభ వాయిదా పడింది. తరువాత కూడా ఆర్‌డీవో, తహసీల్దార్ వచ్చి నిర్వాసితులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. కానీ వీలు పడలేదు.

అసలైన లబ్ధిదారులకు అన్యాయం

రాజానపాలేనికి చెందిన మాజీ సైనికోద్యోగి రాజాన అప్పలనాయుడుకి సర్వే నంబర్ 246/2, పట్టా నెంబర్ 301 ప్రకారం 4.70 ఎకరాల భూమి ఇచ్చారు. ఆయన అక్కడే రాజాన రాజేష్ నాయుడు స్మృతి పేరుతో గృహాన్ని నిర్మించుకొని, తన కిచ్చిన భూమిలో జీడిమామిడి తోట పెంచుకున్నారు. ఆయనకు కేవలం 1.49 ఎకరాల్లో జీడితోటలున్నాయని వైసీపీ నాయకులు రికార్డుల్లో నమోదు చేయించారు. పైల ముత్యాలమ్మకు సర్వే నంబరు 131లో పట్టా నంబరు 252/4 ప్రకారం 52 సెంట్ల భూమి ఉంది. కానీ నిర్వాసితుల జాబితాలో ఆమె పేరు లేదు. అలాగే పైల రాముకి ఎకరా భూమి ఉంది. కానీ అతని పేరు కూడా నిర్వాసితుల జాబితాలో లేదు. వీటిని టీడీపీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇవి కొన్ని మాత్రమేనని బహిరంగ విచారణ జరిపితే ఇలాంటివి చాలా ఉన్నాయని నిర్వాసితులతో పాటు టీడీపీ నాయకులు అధికారులకు వివరించారు. దీంతో ఐదుగురు సభ్యులతో కమిటీ వేసి నిజ నిర్ధారణ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయినా ఎన్నికల ముందు వైసీపీ నాయకులు తయారు చేసిన జాబితా ప్రకారం పరిహారం పంపిణీ చేసేద్దామని అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. దీనిని గమనించిన కొందరు నిర్వాసితులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. దీంతో పరిహారం పంపిణీ ఆగిపోయింది. ఈలోగా ఎన్నికల కోడ్ వచ్చింది. కాగా పేద నిర్వాసితులంతా ఇప్పుడు రోడ్డున పడ్డారు. టీడీపీ హయాంలో జాబితాలు తయారైన తరువాత తమకు పరిహారం త్వరలోనే అందుతుందన్న ఉద్దేశంతో రైతులు తాము సాగుచేసుకుంటున్న కొండలను అధికారులకు అప్పగించేశారు. దీంతో ఏపీఐఐసీ అధికారులు ఈ కొండలను బార్క్‌కి అప్పగించారు. బార్క్ ఈ రెండు కొండల చుట్టూ భారీ ప్రహరీ గోడ నిర్మించేసింది. దీంతో రైతులు రెంటికీ చెడ్డ రేవడిలా మిగిలారు. పరిహారం రాక, తమ భూమిలోకి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

» వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజకీయాలు కలుషితం » నాడు ప్రతిపక్షాలను ప్రత్యర్థులుగా చూస్తే.. నేడు శత్రువులుగా భావించి వేధింపులు

» జగన్ అసమర్థ పాలన వలన ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో వెనుకబాటు » ఎన్నికల ప్రచార సభల్లో అయ్యన్నపాత్రుడు



నాతవరం మండలం ఎంబీపట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న అయ్యన్నపాత్రుడు

నాతవరం, మే 8 : రాష్ట్రం బాగుపడాలంటే ఈ ఎన్నికల్లో ప్రజలంతా కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. మండలంలోని ఎంబీపట్నంలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు రాజకీయాల్లో ప్రత్యర్థులు మాత్రమే ఉండేవారన్నారు. కానీ నేడు ప్రతిపక్షాలను శత్రువులుగా చూస్తూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జగన్ అసమర్థ పాలన వలన రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుబడిపోయిందన్నారు. అలాగే ఉత్తరాంధ్రలో భూకబ్జాలు పెరిగాయని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే తనలాంటి నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. వీటన్నింటికీ ప్రజలు ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలని అయ్యన్న కోరారు. అంతకుముందు కొందరు వైసీపీ నాయకులు టీడీపీలో చేరడంతో అయ్యన్న కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు, నాయకులు పల్లి బాపన్ననాయుడు, కిల్లాడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెంలో పలువురు బుధవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి నర్సీపట్నంలో మాజీ మంత్రి, ఆ పార్టీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, నాయకులు బెల్లపు కొండలరావు, రాయపురెడ్డి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'జగన్ పాలనలో యువత భవిష్యత్తు అగమ్యగోచరం'

నర్సీపట్నం అర్బన్ : జగన్ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత భవిష్యత్తు అగమ్యగోచరగా మారింది మాజీ మంత్రి, టీడీపీ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు అన్నారు. చెట్టుపల్లి, ఓఎల్‌పురం గ్రామాల్లో బుధవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ విధానాల వలన రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాక యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయారన్నారు. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. జడ్పీటీసీ సుకల రమణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, నాయకులు బోళెం రామ్ ప్రసాద్, గజాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి వచ్చిన ధర్మశ్రీ కుమార్తెకు చుక్కెదురు!

» గత ఎన్నికల్లో రోడ్డు వేస్తామంటే ఓట్లు వేశాం

» గెలిశాక ఎమ్మెల్యే మా గ్రామం వంకే చూడలేదు

» నిలదీసిన గుర్రంపేట గ్రామస్థులు

రోలుగుంట, మే 8: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కుమార్తెకు చుక్కెదురైంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని గుర్రంపేట గ్రామానికి చెందిన కొందరు బుచ్చెంపేట గ్రామ శివారున ఉన్న చెరువులో బుధవారం ఉపాధి పనులు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుచ్చెంపేట సర్పంచ్ భర్త ఉలబాల రాము, ఇతర వైసీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ధర్మశ్రీ కుమార్తె స్వాతి అక్కడికి వెళ్లారు. వైసీపీ గురించి, ప్రభుత్వ పథకాల గురించి చెప్పకముందే వారంతా ఆమెకు ఎదురు ప్రశ్న వేశారు. గత ఎన్నికల ముందు కె.నాయుడుపాలెం నుంచి గుర్రంపేటకు రోడ్డు వేస్తామని హామీ ఇచ్చినందున వైసీపీకి ఓట్లు వేశామన్నారు. తీరా గెలిచాక ఎమ్మెల్యే ధర్మశ్రీ తమ గ్రామం వైపే చూడలేదని వార్డు మాజీ సభ్యుడు మాకిరెడ్డి లక్ష్మణమూర్తి తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ మద్దతుతో పోటీ చేసిన వ్యక్తిని వార్డు సభ్యుడిగా గెలిపించుకున్నామని, కనీసం ఆయన కోసమైనా రోడ్డు వేయాలి కదా.. అని నిలదీశారు. దీంతో 90 ఓట్లకే రోడ్డు వేస్తామా... మా ఊరు ఓట్లు ఎన్ని.., మీ ఊరు ఓట్లు ఎన్ని అంటూ.. వైసీపీ నాయకుడు రాము ఎదురు ప్రశ్న వేశారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ధర్మశ్రీ కుమార్తె అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కూటమికి నాయీ బ్రాహ్మణ సంఘం మద్దతు

» ఈ అభ్యర్థులకు ఓట్లు వేయాల్సిందిగా జిల్లా అధ్యక్షుడు రమేష్ పిలుపు



కూటమి కరపత్రాలు చూపుతున్న జిల్లా అధ్యక్షుడు రమేష్ తదితరులు

కృష్ణాదేవిపేట, మే 8: జిల్లాలో నాయీ బ్రాహ్మణులంతా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లేటికుర్తి రమేష్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో బుధవారం ఏర్పాటైన సంఘ నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో సంఘ సభ్యులంతా అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు, అలాగే నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు ఓటు వేయాలన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సంఘం నర్సీపట్నం నాయకులు పెద్దపల్లి శ్రీను, తుంపాల రాజ్‌కుమార్, రాజాన అప్పలరాజు, గంగరాజు, స్థానిక నాయకులు సగరపు రామకృష్ణ, మూగుండు అప్పారావు, గోలకొండ వెంకటరమణ, గుడివాడ రామకృష్ణ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో బుల్లితెర నటీనటులు ప్రచారం



మాడుగులలో ర్యాలీగా వస్తున్న బుల్లితెర నటీనటులు

మాడుగుల, మే 8 : ఎన్నికల ప్రచారంలో భాగంగా బుల్లి తెర నటీనటులు మాడుగులలో సందడి చేశారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి బుధవారం ఇక్కడ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె వెంట కార్తీక దీపం, ముద్ద మందారంతో పాటు పలు సీరియళ్లలో నటించిన బుల్లితెర నటులు డాక్టర్ బాబు, జాకీ, హరిత, నిరుపం పరిటాల, మంజుల వంటివారు రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాడుగుల గాంధీపార్కు నుంచి గవర వీధి, జగ్గన్న చావడి, శతకంపట్టు మీదుగా ప్రచారం చేస్తూ భారీ ర్యాలీగా బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణను ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

'ఎన్డీయే కూటమి గెలుపుతోనే ప్రగతి'



కొమరవోలు మాట్లాడుతున్న జనసేన నాయకుడు రాజు

రోలుగుంట, మే 8 : ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు కోరారు. మండలంలోని కొంతలం, కొమరవోలు గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బలిజి మహరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు

బుచ్చెయ్యపేట, మే 8 : ప్రజలంతా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ డి.ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు బుధవారం లోపూడి, ఎల్‌బీపీ అగ్రహారం, బంగారుమెట్ట, ఎల్.సింగవరం, చినఅప్పన్నపాలెం, బుచ్చెయ్యపేట, పోలేపల్లి, దిబ్బిడి, కందిపూడి గ్రామాల్లో పోలీసులు బలగాలతో కలిపి కవాతు నిర్వహించారు. రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడినట్లు సమాచారం అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



కె.కోటపాడులో మాట్లాడుతున్న ఎస్ఐ

కె.కోటపాడు, : మండల కేంద్రం కె.కోటపాడులో బుధవారం ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేయాల్సిందిగా ఎస్ఐ సూచించారు.



బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్టలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఘనంగా దుర్గాలమ్మ పండగ



మాకవరపాలెం, మే 8 : మండల కేంద్రం మాకవరపాలెంలో దుర్గాలమ్మ పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని గ్రామ పురవీధిల్లో ఊరేగించారు.

జిల్లాలో ఇద్దరికి పాలీసెట్‌లో స్టేట్ ఫస్టు ర్యాంక్

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వ ఉద్యోగాలు. ప్రస్తుతం వీరి కుటుంబం విశాఖపట్నంలో నివాసం ఉంటున్నది. ఈ సందర్భంగా జ్ఞానహర్షిత విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి మార్కుల ఆధారంగా ట్రిబుల్ ఐటీలో చేరాలనుకుంటున్నట్టు చెప్పింది. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన హర్షితను పలువురు అభినందించారు. కాగా పాయకరావుపేట లింగాలతోటకాలనీలో నివాసముంటున్న శీలం శ్రీను కుమారుడు శ్రీరామ్ భవదీప్ సంగివలస విద్యా సంస్థల్లో చదువుతున్నాడు. శ్రీరామ్ తండ్రి కాకినాడ జిల్లా అన్నవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి ఫణిశ్రీ గృహిణి. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఐఐటీలో సీటు సాధించి ఇంజనీరింగ్ చదవాలన్నది తన లక్ష్య మని తెలిపాడు.

అనుకున్నదొక్కటి...!

... 5వ పేజీ తరువాయి

సమయానికి ఆ సంఖ్య 52 వేలకు, ప్రస్తుతం 48 వేలకు తగ్గిపోయిందని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఖాళీల భర్తీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శిస్తున్నారు. టీడీపీ హయాంలో 3,600 డ్రైవర్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలను సిద్ధం చేశారని, వైసీపీ వచ్చిన తరువాత దానిపై కదలిక లేదని నిట్టూరుస్తున్నారు. పైగా ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు బడ్జెట్ కేటాయింపులు నిలిపివేసి, అద్దె బస్సుల సంఖ్యను పెంచడం ద్వారా ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఉద్యోగులు, కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలోని ఇతర శాఖలతో పోల్చితే ఆర్టీసీలోనే ఉద్యోగుల మరణాలు ఎక్కువని, ప్రతి నెలా సగటున 26 నుంచి 29 మంది వివిధ కారణాలతో మృత్యువాతపడుతున్నారన్నారు. కేన్సర్, పక్షవాతం, అంగవైకల్యం వంటి వాటికి గురైన వారికి మాత్రమే కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించి, ఇతరత్రా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారిని నిర్లక్ష్యం చేస్తోందని ఉద్యోగ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. అనారోగ్య కారణాలతో డ్రైవర్, మెకానిక్ వంటి ఉద్యోగాలకు అన్‌ఫిట్‌గా మారుతున్నారని, అలాంటివారు రాష్ట్రవ్యాప్తంగా 220 మంది ఉన్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు.

వైసీపీ నుంచి 25 కుటుంబాలు టీడీపీలో చేరిక

» కండువాలు కప్పి ఆహ్వానించిన 'కిలపర్తి'



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎంపీపీ కిలపర్తి

దేవరాపల్లి, మే 8 : మాడుగుల నియోజకవర్గంలో కీలక నేత, ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు కూటమి అభ్యర్థుల తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయన సారథ్యంలో నియోజకవర్గంలోని భారీగా చేరికలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రం దేవరాపల్లి చెందిన 25 కుటుంబాలు టీడీపీలో చేరడంతో వారికి భాస్కరరావు తమ ఇంటి వద్ద కుండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి విజయమే లక్ష్యంగా అంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్బవరపు మాలిబాబు, కాటపల్లి సన్యాసిరావు, నాగభూషణం, అచ్చిబాబు, చింతాలు, సన్నిబాబు, అప్పారావు, ఈశ్వరరావు, శ్రీను, చిన్నారావు పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రాంతాల్లో సీఎం రమేష్ సతీమణి ప్రచారం



గుడ్డిప గొర్లవాని చెరువులో మాట్లాడుతున్న శ్రీదేవి

రావికమతం, మే 8 : జిల్లా అభివృద్ధికి ప్రజలంతా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా అనకాపల్లి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి కోరారు. మండలంలోని గుడ్డిప, గొర్లలోవ, గొంపబంద చెరువుల్లో పనులు చేస్తున్న ఉపాధి కూలీలను బుధవారం కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కూలీల సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా అభివృద్ధికి, ప్రజల కష్టాలు తీరేందుకు ఎంపీ అభ్యరి సీఎం రమేష్‌కు కమలం గుర్తుపైన, టీడీపీ చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుకు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. కూటమి నాయకులు గంజి సూర్యనారాయణ, గల్లా రాజేశ్వరావు, గల్లా సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాడుగుల వైసీపీ నేతలు



పార్టీలో చేరిన మాడుగుల వైసీపీ శ్రేణులతో బీజేపీ నేతలు

కొత్తూరు, మే 8: మాడుగుల నియోజకవర్గం వైసీపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. మాడుగుల వైసీపీ మహిళా అధ్యక్షురాలు పైలా అమ్మాజీ, మాజీ సర్పంచ్ తమరన దాలినాయుడు, కిషోర్‌నాయుడు, సుంకర నాగేశ్వరరావులకు ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ పార్టీలోకి చేరిన ప్రతి నాయకునికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, రాష్ట్ర నాయకులు సురేంద్రమోహన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పునః పరిశీలించండి

» సెక్టార్ అధికారులకు ఆర్‌వో జయరాం సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో జయరాం

నర్సీపట్నం, మే 8 : పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక సదుపాయాల పరంగా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని నర్సీపట్నం రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం అధికారులకు సూచించారు. సెక్టార్ అధికారులతో గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మరో ఐదు రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు తప్పకుండా ఉండాలన్నారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ తర్వాత కావల్సిన ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీ మోహన్, తహసీల్దార్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రెండు మండలాల్లో భారీ వర్షం



మాడుగుల/మాడుగుల రూరల్/రావికమతం 8 : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగానే ఉంది. కాస్త ఎండ తీవ్రత ఉన్నప్పటికీ సాయంత్రం నాలుగు గంటలకు వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. అలాగే, రావికమతం మండలంలోనూ వర్షం కురిసింది.